# తెలుగురాష్ట్రం

దినపత్రిక

APTEL/2016/66202




గురువైభవోత్సవం అవార్డు అందుకున్న మంత్రి లోకేశ్

4లో..


అమలాపురం | సంపుటి : 10 సంచిక : 10 | ఎడిటర్ : అయితాబత్తుల రాజశేఖర్ | ఆదివారం 02 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amlapuram Vol:10 Issue : 10 02-03-2025 Sunday Edirtor : AITHABATHULA RAJASEKHAR Pages : 8 Rs: 5/-




## ఐదేళ్ల విధ్వంసం నుంచి.. రాష్ట్రం

# ఇప్పుడిప్పుడే కోలుకుంటుంది..

ఇంటింటికి ఇంటర్‌నెట్ తీసుకొస్తాం:
- పేదల బతుకుల్లో వెలుగులు నింపడమే లక్ష్యం - -జిడి నెల్లూరులో పింఛన్ల పంపిణీలో సిఎం చంద్రబాబు

అమరావతి మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పేదల బతుకుల్లో వెలుగులు నింపాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. ఇదేళ్ల విధ్వంసం నుండి రాష్టం ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని ఆయన అన్నారు. చిత్తూరు జిల్లాలోని గంగాధర నెల్లూరులో శనివారం పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లబ్దిదారులకు స్వయంగా పెన్షన్లను పంపిణీ చేశారు. లబ్దిదారులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దళితవాడలో ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ... గత ఐదేళ్లపాటు జనం ఎన్నో బాధలు పడ్డారని, ఇప్పుడు 64 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు. దివ్యాంగుల పెన్షన్లు రూ.6 వేలకు పెంచామన్నారు. 8 లక్షల మంది దివ్యాంగులకు పెన్షన్లు ఇస్తున్నామన్నారు. కిడ్నీ, తలసేమియా రోగులకు రూ.10వేలు ఇస్తున్నామని, తీవ్ర వ్యాధులతో కదలలేని వారికి రూ.15 వేలు ఇస్తున్నామని వెల్లడించారు.

తరువాయి 2లో..







## వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరల పెంపు



న్యూఢిల్లీ మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జనాలపై గ్యాస్ భారం స్వల్పంగా పెరిగింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరను పెంచినట్టు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తాజాగా ప్రకటించాయి. 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధరను రూ.6 మేరకు పెంచినట్టు ప్రకటించారు. ప్రస్తుతం వాణిజ్య సిలిండర్ ధర రూ.1797 ఉండగా తాజా పెంపుతో ధర రూ.1803కు చేరింది. ఇక పెరిగిన ధరలు నేటి నుంచే అమల్లోకి వస్తాయని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు పేర్కొన్నాయి. గత ఐదేళ్లల్లో ఇంత స్వల్ప స్థాయిలో వాణిజ్య సిలిండర్ ధరలు పెరగడం ఇదే తొలిసారి. మార్చి 2023లో ఏకంగా రూ.352 మేర ధరలు పెరిగాయి. ఇటీవల బడ్జెట్‌లో కేంద్రం వాణిజ్య సిలిండర్ ధర రూ.7 మేర తగ్గించినట్టు పేర్కొన్నా తాజా పెంపుతో నాటి ప్రయోజనంలో కోత పడినట్టైంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తాజాగా సమాచారం ప్రకారం, ఢిల్లీలో గ్యాస్ సిలిండర్ తాజా ధర రూ.1803గా ఉంది. కోల్‌కతాలో రూ.1913, ముంబైలో రూ.1755, చెన్నైలో రూ.1965గా ఉంది.

**డొమెస్టిక్ సిలిండర్ ధరలు యథాతథం**

కమర్షియల్ సిలిండర్ ధరలు పెరిగినా గృహవినియోగ సిలిండర్‌ల ధరల్లో మాత్రం ఎటువంటి మార్పు లేదు.
వివిధ నగరాల్లో డొమెస్టిక్ సిలిండర్‌ల

- తరువాయి 2లో..



## జనసేన ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

**జనసేన ప్లీనరీ సమావేశం**
**.. భారీగా హాజరైన కేడర్**
**.. దిశా నిర్దేశం చేసిన నాదెండ్ల**

కాకినాడ మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):

జనసేన 12వ ప్లీనరీ బహిరంగ సభ ఈ నెల 14వ తేదీన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్య%శీ% వహిస్తున్న పిఠాపురం నియోజవర్గంలో జరగనుంది. పిఠాపురం మండలం చిత్రాడ ఎస్ బి లే అవుట్ లో బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని శనివారం కాకినాడ గోదావరి కళాక్షేత్రంలో సమయాత్త సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. కేడర్ కు దిశా నిర్దేశం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన పార్టీ కీలక నాయకులు హాజరయ్యారు. మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కార్యకర్తలు అండగా ఉన్నారని అభినందించారు. ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నుంచి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ కేసులు ఎదుర్కొన్నారు అని గుర్తు చేశారు. విశాఖలో పవన్ కళ్యాణ్ ను మూడు రోజులు నిర్బంధించారని వెల్లడించారు. చంద్రబాబు అరెస్ట్ అయినప్పుడు పరామర్శ కోసం వస్తుంటే విమానాన్ని రానీయలేదు. రోడ్డు మార్గంలో రానివ్వలేదు. తెలంగాణ కార్యకర్తలు వెన్నంటి వచ్చారని గుర్తు చేసారు. అదేవిధంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా పనిచేసిన చంద్రశేఖర్ రెడ్డి దౌర్జన్యాలు చేసాడు. మహిళలపై
తిరుగుబడ్డాడు అన్నారు.
పరుష పదజాలం కాకుండా

- తరువాయి 2లో..

## 125 ఏళ్లలో ఈ ఏడాది ఎండ తీవ్రత అధికం


### హైదరాబాద్ వాతావరణ కేంద్రం

- మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండవచ్చునని వెల్లడి
- దక్షిణ, మధ్య తెలంగాణతో పాటు హైదరాబాద్ పరిసరాల్లో అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని వెల్లడి
- దక్షిణ, ఉత్తర తెలంగాణలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందన్న వాతావరణ కేంద్రం

హైదరాబాద్ మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

1901 నుండి 2025 వరకు సరాసరి సగటు తీసుకుంటే ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత సాధారణం కంటే అధికంగా ఉంటుందని, వడగాలులు కూడా తీవ్రంగా ఉంటాయని తెలిపింది. ఏప్రిల్, మే నెల వచ్చేసరికి 44 నుండి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
ఉందని

- తరువాయి 2లో..






## పోసాని గోరంట్లపై చర్యలు ఉంటాయి

### మంత్రి అనిత

అమరావతి మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ హెూం మంత్రి వంగలపూడి అనిత ఇటీవల పోసాని కృష్ణ మురళీ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఏపీ ఎన్డీయే ప్రభుత్వ

- మిగతా 2లో..

## హిమపాతం విరుచుకుపడి నలుగురు మృతి



ఉత్తరాఖండ్‌పై హిమపాతం విరుచుకుపడింది. ఈ ఘటనలో నలుగురు కార్మికులు మృతి చెందారు. శుక్రవారం ఆ రాష్ట్రంలోని చమోలి జిల్లాలోని సరిహద్దు గ్రామం మానా సమీపంలో ఆకస్మిక మంచు కురిసింది. ఆ సమయంలోనే రహదరి పనులు చేస్తున్న కార్మికులు ఆ మంచులో చిక్కుకుపోయారు. సుమారు 55 మందిలో 47 మందిని ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ సహాయక బృందాలు కాపాడాయి. మరో 8 మందిని మంచు నుంచి బయటకు తీసేందుకు రెస్క్యూ సిబ్బంది శనివారం ఉదయం నుంచి ప్రయత్నిస్తున్నారు. దురదృష్టవశాత్తు ఈ ఘటనలో నలుగురు మృతి చెందారని డెహ్రాడూన్ డిఫెన్స్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పిఆర్ఓ) తెలిపారు. మృతదేహాలను బయటకు తీసేందుకు రెస్క్యూ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు అని లెఫ్టినెంట్ జనరల్ అనీంద్యా సేన్‌గుప్తా, జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ సెంట్రల్ కమాండ్ (జిఓసి-ఇన్-సి) తెలిపారు.

## పోసాని కృష్ణమురళికి స్వల్ప అస్వస్థత

అమరావతి మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అసభ్యకర వ్యాఖ్యలతో జైలుపాలైన నటుడు, వైసీపీ నాయకుడు పోసాని కృష్ణ మురళి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్‌జైలులో ఉన్న పోసాని ఛాతిలో నొప్పిగా ఉందని జైలు

- తరువాయి 2లో..



## ఆశా వర్కర్లకు చంద్రబాబు వరాలు



అమరావతి మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

: ఆశా వర్కర్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరాలు కురిపించారు. ఆశా వర్కర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిర్ణయించారు సీఎం. ఇందులో భాగంగా ఆశా వర్కర్లకు మొదటి రెండు ప్రసవాలకు 180 రోజుల
వేతనంతో కూడిన ప్రసూతి సెలవు

- తరువాయి 2లో..

# సంపాదకీయం

## కొనుగోలు' శక్తి!

దేశంలోని వంద కోట్ల మందికిపైగా ప్రజలు వస్తు, సేవలకు వినియోగదార్లయ్యేందుకు వారికి కొనుగోలు శక్తి లేదని బ్లూమ్ వెంచర్స్ ఇటీవల వెల్లడించిన నివేదికతో అయినా మన పాలకులు కళ్లు తెరుస్తారేమో చూడాలి. 'భారత్ వెలిగిపోతోంది' అంటూ పాలకవర్గాలు పదేపదే ఊదర గొడుతుంటే అదేం లేదు మెజారిటీ భారత దేశం కునారిల్లిపోతోంది అని ప్రజానుకూల ఆర్థికవేత్తలు చెబుతూనే వున్నారు. మార్కెట్ పరిస్థితిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి వాస్తవాలను వివరిస్తూ ప్రపంచ బడా కార్పొరేట్లకు మార్గనిర్దేశనం చేసేలాంటి బ్లూమ్‌బెర్గ్ సంస్థ నుండి ఇటువంటి నిర్ధారణలు వెల్లడయ్యాకనైనా వారికి తత్వం బోధపడుతుందా! దేశ జనాభాలోని 30 కోట్ల మంది తమ ఆహార ఖర్చులకు, అత్యవసర ఖర్చులకూ అవసరమైన డబ్బు మాత్రమే ఉంటోందని నివేదిక పేర్కొన్నది. ఇక మిగిలిన 13-14 కోట్ల మంది మాత్రమే మార్కెట్‌లో ఏవైనా సరుకులు లేదా ఖరీదైన సేవలకు వినియోగదారులగా ఉన్నారని తేల్చి చెప్పింది. అంటే దేశ జనాభాలో దాదాపు పది శాతం మంది మాత్రమే! కాబట్టి అత్యధిక మంది ఆదాయాలు కుంగిపోయి అలా అలా దిగజారుతున్నారనీ, కొద్ది మంది మాత్రమే అధికాదాయాలతో సంపన్నులవుతున్నారని స్పష్టమవుతోంది. ఆర్థిక వృద్ధిలో ఇది ప్రగతిశీల ఆర్థికవేత్తలు వివరిస్తున్న ఇంగ్లీషు అక్షరం 'కె' నమూనాను వ్యక్తం చేస్తోంది కదా! కోవిడ్‌తో ఆర్థిక వ్యవస్థ దెబ్బ తిన్నదనీ అయితే అది మరింత పుంజుకొని, ఇంగ్లీషు అక్షరం 'వి' నమూనాలో పైకెగుస్తుందనీ, అందుకే ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ అంటూ నీతి ఆయోగ్ మొదలు ప్రధాని మోడీ వరకు గొప్పలు చెప్పారు. అది తప్పని బ్లూమ్‌బెర్గ్ వెంచర్స్ తాజా నివేదిక కూడా తేల్చి చెప్పింది.

కాబట్టి ఆర్థిక వ్యవస్థ పురోగమనానికి ఇప్పుడు కావలసింది ప్రజల కొనుగోలు శక్తి పెరగడం. అది కూడా సామాన్యులు, నిరుపేదలకు ఆదాయాలు వస్తేనే వినిమయం పెరుగుతుంది. ఎందుకంటే పేదవారికి వచ్చే ప్రతీ రూపాయినీ వారు ఖర్చు చేస్తారు. అదే సంన్నులకు వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని మాత్రమే వారు వినిమయం కోసం ఖర్చు చేస్తారు. మార్కెట్‌లో తగినంత డిమాండ్ ఉన్నప్పుడే పెట్టుబడిదారులు పెట్టుబడులతో ముందుకొస్తారు తప్ప సమ్మిట్‌లు, ప్రెజెంటేషన్లతో మాత్రమే కాదు. స్థూల వినిమయం తగ్గుతున్నప్పుడు వారు పెట్టుబడులు అదనంగా పెట్టడానికి ముందుకు రారు. దాని వలన సంక్షోభం మరింత ముదిరిపోతుంది. 1930 దశకానికి చెందిన ప్రముఖ ఆర్థికవేత్త కీన్స్ పెట్టుబడిదారీ వ్యవస్థకు సమర్ధకుడు. ఈ సంక్షోభం ముదిరితే అది పెట్టుబడిదారీ వ్యవస్థనే కూల్చివేసే తిరుగుబాట్లకు దారి తీయవచ్చునని ఆయన భయపడ్డాడు. పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడుకోవాలంటే స్థూల డిమాండ్‌ను పెంచాల్సిందేనని, అందుకు ప్రభుత్వాలే పూనుకోవాలని సూచించాడు. ఆనాడు మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచం ఆ దిశగా నడిచింది కూడా. అప్పుడు ముందుకొచ్చిందే శ్రేయోరాజ్య భావన కూడా! కాని ప్రస్తుత పెట్టుబడిదారీ ప్రపంచంలో సరిగ్గా కీన్స్ చెప్పినదానికి భిన్నమైన దిశగా జరుగుతోంది. దీని పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉండబోతున్నాయి.

ఇప్పుడు దేశం ముందుకెళ్లాలన్నా, ఆర్థిక వ్యవస్థ సంక్షోభం మరింత ముదరకూడదనుకున్నా ప్రజల ఆదాయాలు పెంచడం తప్పనిసరి. అందుకు ప్రభుత్వ వ్యయం పెంచడమే సరైన పరిష్కారం. అందుకనుగుణమైన చర్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలి. రైతు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి. ప్రజా బాహుళ్యానికి అటు పని, ఇటు ఆదాయాలతోపాటు ప్రజల సంపద పెంచే గ్రామీణ ఉపాధి హామీ పనులను విస్తారంగా చేపట్టాలి. పట్టణ ప్రాంతాలకు కూడా ఉపాధి చట్టాన్ని విస్తరించాలి. ప్రభుత్వాలు మౌలిక వసతుల కల్పనపై ఖర్చు పెంచాలి. శ్రామికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. కనీస వేతనాలను గ్యారంటీ చేయాలి. ఇటువంటి చర్యల ద్వారా ప్రజలందరి చేతుల్లోకి డబ్బు వస్తేనే మార్కెట్‌లో వస్తు, సేవలను వారు వినియోగిస్తారు. అప్పుడే ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుంది. ఈ దిశగా పాలకులు ఆలోచించాలి. లేకపోతే అందుకు ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి పెంచాలి. బ్లూమ్‌బెర్గ్ వెంచర్స్ నివేదిక నుండి తీసుకోవలసిన గుణపాఠం ఇదే!

# సింగపూర్ తెలుగు సమాజం గోల్డన్ జూబ్లీ వేడుకలకు స్పీకర్‌కు ఆహ్వానం

నర్సీపట్నం ఫిబ్రవరి 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సింగపూర్ తెలుగు సమాజం ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గౌరవ అయ్యన్నపాత్రుడును స్పీకర్ ఛాంబర్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. 1975లో స్థాపితమైన ఈ సంఘం గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఏప్రిల్ 2025లో ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సమాజ అధ్యక్షుడు బమ్మరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కాకర్ల మహేష్ చౌదరి స్పీకర్ అయ్యన్నపాత్రుడును డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజును కలిసి వేడుకలకు సాధారంగా ఆహ్వానించారు. సింగపూర్‌లో స్థాపితమైన తెలుగు సమాజం, ప్రముఖ తెలుగు సంఘాలలో ఒకటైన ఈ సంస్థ తెలుగువారి సాంస్కృతిక, సాహిత్య, సామాజిక, విద్యా సేవా కార్యక్రమాలకు వేదికగా నిలుస్తోందని వారు తెలిపారు. దశాబ్దాలుగా ఈ సంస్థ తెలుగు రాష్ట్రాలతో బంధాన్ని పెంపొందిస్తూ, రెండు ప్రాంతాల మధ్య పెట్టుబడులు, మైగ్రేషన్ మార్పిడులను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు హాజరు సమాజానికి గౌరవంగా ఉండటంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి గొప్ప ప్రేరణగా నిలుస్తుందని బమ్మరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు.



## ఐదేళ్ల విధ్వంసం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటుంది..

పెన్షన్ల కోసం రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కుటుంబ సంబంధాలు, విలువలకు మన దేశం ప్రపంచానికే ఆదర్శమన్నారు. అనాథ పిల్లల బాగోగులు చూసుకునేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏసీ గదుల్లో కూర్చుంటే పేదల సమస్యలు, కష్టాలు తెలియవన్నారు. క్షేత్రస్థాయిలోనే తిరిగితేనే అధికారులకు ప్రజల బాధలు తెలుస్తాయన్నారు. పెన్షన్లు ఇంటికే వెళ్లి ఇవ్వాలని అధికారులకు చెప్పామన్నారు. "పేదల జీవితాల్లో వెలుగులు రావాలి.. అదే నా ఆకాంక్ష.." అని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని మండిపడ్డారు. ప్రజలు అన్నీ తెలుసుకుని కూటమి ప్రభుత్వాన్ని తీసుకువచ్చారని తెలిపారు. గత ఐదేళ్లు చేసిన విధ్వంసం తనకే అర్థం కావడం లేదన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికెళ్లి పెన్షన్లు అందిస్తున్నామన్నారు. చెప్పిన ప్రతి హామీ నిలబెట్టుకునేందుకు నిత్యం కృషి చేస్తున్నామన్నారు. ప్రతి సేవా సెల్‌ఫోన్ ద్వారా అందించేందుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. డ్రోన్ ద్వారా ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ద్వారా పేదల జీవితాల్లో మార్పులు తెస్తామని అన్నారు. సంపద ఎలా సృష్టించాలన్న దానిపై నిత్యం ఆలోచన చేస్తున్నామన్నారు. తాము వచ్చిన 9 నెలల్లోనే 12.9 శాతం వృద్ధి రేటు సాధించామని చెప్పుకొచ్చారు. కేంద్రంతో కలిసి చేసే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చి పనులు త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తున్నామన్నారు. నాగరిక ప్రపంచంలో పారిశుద్ధ్యం చాలా అవసరమని, మరో 2 నెలల్లో రోడ్లపై గుంతలు పూడ్చుటం పూర్తవుతుందని సీఎం తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో నాలుగు వరుసల్లో కొత్త రోడ్లు వేస్తున్నామన్నారు. మీ భూ పత్రాలపై రాజముద్ర ఉండాలని, నేతల ఫొటోలు కాదన్నారు. తల్లికి వందనం పేరుతో ఒక్కొక్కరికీ రూ.15 వేలు ఇస్తామని వెల్లడించారు. ఎంత మంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం కింద సాయం చేస్తామని మరోసారి స్పష్టం చేశారు. పిల్లల ఖర్చుల బాధలు తగ్గించే బాధ్యత తామే తీసుకుంటామన్నారు. మే నెలలో తల్లికి వందనం ఇస్తామని ప్రకటించారు. త్వరలోనే రైతులకు రూ.20వేలు ఆర్థిక సాయం చేస్తామన్నారు. అలాగే మత్స్యకార కుటుంబాలకు రూ.20వేల ఆర్థిక సాయం చేస్తామని తెలిపారు. ఆర్థిక సాయం చేసే వీలుంటేనే హామీ ఇస్తామని, లేకుంటే మాయమాటలు చెప్పనని తెలిపారు. రెండు వేల ఎకరాల్లో భారీ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

**కష్టపడి పని చేసే కార్యకర్తలకు అండగా ఉంటా**

ఆన్‌లైన్‌లో రికార్డు స్థాయిలో టీడీపీ సభ్యత్వాలు జరిగాయన్నారు. గత ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. కార్యకర్తలు గట్టిగా నిలబడ్డారని అభినందించారు. దేశంలో ఎప్పుడూ ఇలాంటి విక్టరీ రాలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కార్యకర్తల కృషిని ఆయన అభినందించారు. గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు వచ్చాయని, సమస్యలను అవకాశాలుగా మార్చుకున్నామని చెప్పారు. టీడీపీ కుటుంబ సభ్యులకు నేను రుణపడి ఉన్నానని తెలిపారు. ప్రభుత్వం సజావుగా పని చేయడానికి కార్యకర్తల నుంచి సహకారం చాలా అవసరం అన్నారు. నేను గతంలో మాదిరిగా ఉండనని ముందే చెప్పానని చంద్రబాబు గుర్తు చేశారు. "2014కు ముందు పార్టీ చాలా సవాళ్లు ఎదుర్కొంది. పార్టీని కాపాడుకునేందుకు చాలా కష్టపడ్డాం. రాష్ట్ర విభజన సమయంలో వైసీపీ డబుల్ గేమ్ ఆడింది. అందుకే రాష్ట్ర ప్రజలు అప్పుడు టీడీపీకి అధికారం ఇచ్చారు" అని గుర్తు చేశారు. ప్రాణం పోయినా మీలో అణువణువూ పసుపు రక్తమే ఉంటుందని ప్రశంసించారు. ఎన్నికల్లో గెలవడానికి ఒక వ్యవస్థను క్రియేట్ చేశామని చెప్పారు. సభ్యత్వ నమోదుకు టెక్నాలజీని ఉపయోగించామని, భవిష్యత్తులో కూడా టెక్నాలజీ సహకారంతో పార్టీ కార్యక్రమాల అమలును పర్యవేక్షిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

## వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరల పెంపు

ధరలు ఎలా ఉన్నాయంటే..
ఢిల్లీ - రూ.803,
కోల్‌కతా - రూ. 829,
ముంబై - రూ.802.50
చెన్నై-రూ.818.50
లఖ్నవూ - రూ.840.50 గా ఉన్నాయి.

ఇక వాణిజ్య అవసరాల కోసం వినియోగించే సిలిండర్‌ల ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నెల నెల మార్పులు చేస్తుంటాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ, ప్రభుత్వ విధానాలు, పన్ను విధానంలో మార్పులు, డిమాండ్ సరఫరాల్లో సీజనల్ మార్పులు, భౌగోళిక రాజకీయ అంశాలు, ఆయిల్ కంపెనీలు ఖర్చులు ఆదాయం వంటి వాటి ఆధారంగా వాణిజ్య సిలిండర్‌ల ధరల్లో కంపెనీలు మార్పులు చేస్తుంటాయి. అయితే, మార్కెట్ ఒడిదుడుకుల ప్రభావం సామాన్యులపై పడకుండా ప్రభుత్వం గృహవినియోగ సిలిండర్‌ల ధరలను నియంత్రిస్తుంది.

## జనసేన ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

బండబూతులు తిట్టిన వారు నేడు ఎక్కడున్నారు గుర్తు చేసుకోవాలి అన్నారు. చట్టం తన పని చేసుకుపోతుంది. అందుకోసమే కొందరు జైల్లో ఉన్నారు. మరికొందరు జైలుకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు .2019 .. 24 వరకు పార్టీలో పని చేసిన కొందరు తమకు టిక్కెట్లు రావనో, భయపడో పార్టీ వదిలి వెళ్ళిపోయారు .వారి పరిస్థితి ఎలా ఉందో గమనించండి అన్నారు. పార్టీ కోసం అంకితభవంతో పనిచేసే వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుంది అనడానికి తనతో సహా వెదిక పై ఉన్నవారే నిదర్శనం అన్నారు. తాము ఎవరు పదవులు ఆశించి రాలేదన్నారు. 14వ తేదీన జరిగే బహిరంగ సభ రాష్ట్ర చరిత్రలో గుర్తుండిపోయేలా నిర్వహిద్దాం అందరూ కలిసి పని చేద్దాం అని పిలుపునిచ్చారు. రాజమండ్రిలో మార్చ్ ఫాస్ట్ చేసినప్పుడు ప్రభుత్వంలో కదిలిక ఎలా వచ్చిందో అందరూ గుర్తించారు. ఈ సభ విజయవంతం చేయడం ద్వారా భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీ కూడా ఈ స్థాయిలో నిర్వహించలేదు అన్న మంచి పేరు వచ్చే విధంగా పని చేద్దాము అన్నారు. ఎవరు ప్రమాదాలు తెచ్చుకోవద్దు. ప్రశాంతంగా వచ్చి ప్రశాంతంగా వెళ్దాం. అధినేతకు మంచి పేరు తీసుకొద్దాం అన్నారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ హరిప్రసాద్ ఈ సమావేశం పిఠాపురంలో పెడదామని తాము నిర్ణయించుకుని పవన్ దృష్టికి తీసుకురాగా సమయం సరిపోతుందా అని అడిగారని ఒక రోజు సభ పెడుతున్నట్లు తెలియజేశామన్నారు. యావత్తు ప్రపంచం ఈ సభ గురించి చర్చించుకునేలా ఉండాలని తమకు సూచించారు అన్నారు. 14 వ తేదీ ఆవిర్భావ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, పంతం నానాజీ, కొణతాల రామకృష్ణ, నాయకర్, ఎంపీ ఉదయ శ్రీనివాస్ ,కార్పొరేషన్ చైర్మన్లు, నియమించిన కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 125 ఏళ్లలో ఈ ఏడాది ఎండ తీవ్రత అధికం హైదరాబాద్ వాతావరణ కేంద్రం

వెల్లడించింది. 1901 నుండి సరాసరి సగటు తీసుకుంటే ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశముందని తెలిపింది. ముఖ్యంగా దక్షిణ, మధ్య తెలంగాణతో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వెల్లడించింది. దక్షిణ, ఉత్తర తెలంగాణలో రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు డిగ్రీలు పెరిగే సూచనలు ఉన్నాయని వెల్లడించింది. 125 సంవత్సరాల సరాసరి తీసుకుంటే గాలిలో తేమ తీవ్రత తగ్గినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

## పోసాని గోరంట్లపై చర్యలు ఉంటాయి

హయాంలో ఎవరు తప్పు చేసినా వారిపై చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు. అనంతపురంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైల పాసింగ్ ఔట్ పరేడ్‌లో వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై స్పందించారు. పోసాని అరెస్టు, గోరంట్ల మాధవ్ పై కేసు తదితర అంశాలపై ఆమె వివరణ ఇచ్చారు.

**పోసాని అరెస్ట్ - అనిత కౌంటర్**

పోసాని అరెస్టును ప్రస్తావిస్తూ ఆమె మాట్లాడుతూ, బూతుల స్క్రిప్ట్ పంపింది సజ్జల రామకృష్ణనే అయినా అనుభవిస్తోంది మాత్రం పోసానే కదా అని వ్యాఖ్యానించారు. పోసాని కృష్ణ మురళీ చేసిన వ్యాఖ్యలు నిరక్షరాస్యుడు కూడా చేయలేనివని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం ప్రతి ఒక్కరికి వాక్స్వాతంత్ర్యం ఇచ్చిందే తప్ప, నోటికొచ్చినట్లు మాట్లాడమని చెప్పలేదని స్పష్టం చేశారు

**ఎన్డీయే ప్రభుత్వం - చట్టబద్ధ చర్యలు**

ప్రస్తుతం రాష్ట్రంలో ఏ రాజకీయ నాయకుడైనా, ప్రజాప్రతినిధైనా, సాధారణ పౌరుడైనా %-% ఎవరు తప్పు చేసినా శిక్ష ఒకేలా ఉంటుందని అనిత స్పష్టం చేశారు. ఎన్డీయే ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం లేదని ఆమె పేర్కొన్నారు. రాజకీయ వ్యతిరేకత కారణంగా ఎవరినీ టార్గెట్ చేయడం లేదని హెూం మంత్రి క్లారిటీ ఇచ్చారు.

**రాజకీయ నేతల భవిష్యత్తు %-% రెడ్‌బుక్ విధానం**

వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని తప్పు చేసిన నేతలు ఇప్పుడు రాజకీయ ప్రతీకారం అనే నెపంతో తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అనిత వ్యాఖ్యానించారు. ఆమె మాట్లాడుతూ, రెడ్‌బుక్ అమలు చేస్తే ఒక్క వైసీపీ నేత కూడా రోడ్డు మీద తిరగలేరు అని ఘాటుగా స్పందించారు.

**గోరంట్ల మాధవ్ కేసు**

గతంలో వివాదాస్పద వీడియోలతో వార్తల్లో నిలిచిన గోరంట్ల మాధవ్ పై విచారణ కొనసాగుతోందని, అతనిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెూం మంత్రి స్పష్టం చేశారు. ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం హయాంలో తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు

**మంత్రుల వ్యాఖ్యల రాజకీయ ప్రాధాన్యత**

వైసీపీ హయాంలో ప్రభుత్వ వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకున్న వైనం, ఇప్పుడు వారి నాయకత్వం ఎదుర్కొంటున్న సంక్షోభం %-% ఇవన్నీ అనిత వ్యాఖ్యల్లో కనిపించాయి.

**ముద్రపడ్డ నిజాలు**

పోసాని, గోరంట్ల మాధవ్ పై చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి. ఏపీ హెూం మంత్రి వంగలపూడి అనిత ప్రకటన %-% ప్రభుత్వ ప్రతిష్టను కాపాడే చర్యలే జరుగుతున్నాయి. రాజకీయ కక్ష సాధింపు కాదని, చట్టపరమైన విధానాల ప్రకారమే విచారణ కొనసాగుతోందని స్పష్టం. రాజకీయ నేతల నడవడికకు ప్రభుత్వం మితులు విధిస్తోందని సంకేతం. ఏపీ రాజకీయ వాతావరణంలో పోసాని అరెస్ట్, గోరంట్ల మాధవ్ కేసు వంటి పరిణామాలు కీలకంగా మారాయి. అధికార ఎన్డీయే ప్రభుత్వం తప్పు చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తుందని, ఇకపై రాజకీయ నాయకులు తమ నోరు అదుపులో పెట్టుకోవాల్సిందేనని హెూం మంత్రి అనిత హెచ్చరించారు

## పోసాని కృష్ణమురళికి స్వల్ప అస్వస్థత

సిబ్బందికి తెలుపడంతో ఆయన్ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పోసాని గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని అతడిని పరీక్షించిన వైద్యులు తెలిపారు.

**2డీ ఈకో పరీక్ష**

ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, 2డీ ఈకో పరీక్ష అవసరమని వైద్యులు వివరించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ అధ్యక్షుడు, చంద్రబాబునాయుడితో పాటు నారా లోకేష్, జనసేన అధినేత, పవన్ కల్యాణ్‌పై పోసాని బహిరంగంగా నానా దుర్భాషలాడారు. జనసేన కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గత ఐదురోజుల క్రితం హైదరాబాద్‌లో పోసానిని అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచారు. ఇరువాదనలు విన్న జడ్జి పోసాని మురళికృష్ణకు 14 రోజుల పాటు రిమాండ్ విధించగా రాజంపేట సబ్‌జైలుకు తరలించారు .

## ఆశా వర్కర్లకు చంద్రబాబు వరాలు

మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆశా కార్యకర్తల గరిష్ట వయోపరిమితిని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమానంగా 62 సంవత్సరాలకు పెంచనున్నారు. ఆశా కార్యకర్తలందరికీ ప్రయోజనం చేకూర్చేలా నిబంధనల ప్రకారం గ్రాట్యుటీ చెల్లించనున్నారు.

ప్రస్తుతం ఆశావర్కర్లు నెలకు రూ.10,000/- వేతనం పొందుతున్నారు. వారి సర్వీస్ ముగింపు సందర్భంగా గ్రాట్యుటీ కింద సుమారు రూ.1.5 లక్షలు అందే అవకాశం కల్పించారు ముఖ్యమంత్రి. రాష్ట్రంలో దాదాపు 42,752 మంది ఆశా కార్యకర్తలు ఉన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో 37,017 మంది, పట్టణ ప్రాంతాల్లో 5,735 ఆశా వర్కర్లు ఉన్నారు. త్వరలో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేయనుంది.

తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com



# రాయలసీమలో వలసలు లేకుండా చూడాలన్నదే మా లక్ష్యం

**-మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాల్లో మంత్రి లోకేష్**

**-శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని పాదుకా పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన్న మంత్రి**





కర్నూలు మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
కర్నూలు, మార్చి1(గోదావరి ప్రతినిధి): రాయలసీమలో వలసలు లేకుండా చూడాలన్నదే తమ లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కర్నూలు జిల్లా మంత్రాలయంలో మంత్రి లోకేష్ శనివారం పర్యటించారు. శ్రీ రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మార్చి 1వ తేదీ శనివారం నుంచి ఆరు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. 6వ తేదీ శ్రీ రాఘవేంద్ర స్వామి జన్మదిన వేడుకలు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీ రాఘవేంద్ర స్వామి పీఠాన్ని అధిష్టించిన పరమ పవిత్ర రోజును పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 404వ పాదుకా పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "కోరిన కోర్కెలు తీర్చే దేవుడు శ్రీ రాఘవేంద్రస్వామి. రాఘవేంద్రస్వామి గురువైభవోత్సవాల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. కూటమి ప్రభుత్వంలో ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలి. ఇందుకోసం అహర్నిశలు కృషిచేస్తాం. రాయలసీమలో వలసలు లేకుండా చూడాలన్నదే మా లక్ష్యం. వర్షాలు బాగా కురవాలని కోరుకుంటున్నాను. ప్రజలు, దేవుని ఆశీస్సులు మాకు ఉండాలి" అన్నారు. పట్టాభిషేక మహోత్సవం అనంతరం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు వారు మంత్రి లోకేష్ ను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అంతకు ముందు ఆలయానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా మాంచాలమ్మ అమ్మవారిని దర్శించుకుని మంత్రి నారా లోకేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు పొందారు.



**రథోత్సవంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్**

పట్టాభిషేక మహోత్సవం అనంతరం ఆలయంలో నిర్వహించిన రథోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.



మంగళవాయిద్యాలు, అశేష భక్త జనసందోహం మధ్య రథాన్ని లాగారు. శ్రీ రాఘవేంద్రస్వామి నామస్మరణతో దేవాలయ ప్రాంగణం మారుమోగింది. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, మంత్రాలయం టీడీపీ ఇంఛార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# లోకేష్ కు ఘన స్వాగతం







కర్నూలు మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
కర్నూలు జిల్లా మంత్రాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శనివారం పర్యటించారు. శనివారం ఉదయం హెలికాప్టర్ లో మంత్రాలయం స్కూల్ గ్రౌండ్ కు చేరుకున్న మంత్రి లోకేష్ కు జిల్లా అధికారులు, టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి లోకేష్ కు స్వాగతం పలికిన వారిలో కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎంఎల్ఏ కెఈ శ్యాంబాబు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మంత్రాలయం టీడీపీ ఇంఛార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, మా

# సమయానికి పనులు పూర్తిచేయకపోతే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ లో ఉంచాలి

**జిల్లాలో ఎక్కడా సాగు, త్రాగునీటి సమస్య తలెత్తకూడదు**

**ఇరిగేషన్ అధికారులకు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశం**



ఏలూరు, మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
నిర్దేశించిన సమయంలోగా ఇరిగేషన్ కాలువలు, చెరువులలో గుర్రపుడెక్క, తూడు, పూడికతీత పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ లో ఉంచాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఏలూరు రూరల్, దెందులూరు మండలం సత్యనారాయణపురం, సింగవరం, భీమడోలు మండలం గుండుగొలను, తదితర ప్రాంతాలలోని ఇరిగేషన్ కాలువలు , చెరువులను శనివారం ఇరిగేషన్, రెవిన్యూ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖకు సంబందించిన పనులకు ఎటువంటి నిధుల కొరతా లేదని, గుర్రపుడెక్క, తూడు, పూడికతీత పనులు చేయని కారణంగా సాగు, త్రాగునీటి సమస్య తలెత్తిందన్న ఫిర్యాదు అందితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. నిర్దేశించిన సమయంలోగా ఇరిగేషన్ కాలువలు, చెరువులలో గుర్రపుడెక్క, తూడు, పూడికతీత పనులు పూర్తి అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని, కాంట్రాక్టర్, అధికారులు నిర్లక్ష్యంగా కారణంగా సమస్యలు తలెత్తితే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ లో పెడతామని, అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడా సాగు, త్రాగునీటికి ఎటువంటి కొరతా లేకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతంలోని పొలాలకు సాగునీరు, గ్రామాలకు త్రాగునీటి కొరత లేకుండా చూడాలని, నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న తూడు, గుర్రపుడెక్క వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ పనులకు సంబంధించి మంజూరైన పనులకు టెండర్ల ప్రక్రియ వెంటనే పూర్తిచేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ కెనాల్స్ నుండి అనధికార సాగునీటి వినియోగం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సత్యనారాయణపురం, సింగవరం గ్రామాలలో ఇరిగేషన్ కాలువలలో తోడు, గుర్రపుడెక్క తొలగింపు పనులను కలెక్టర్ పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి . నాగార్జునరావు, ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనీర్ భానుప్రతాప్, తహసీల్దార్లు సుమతి, రమాదేవి, ఇంజనీర్లు పి . సుబ్రహ్మణేశ్వరరావు, ఎస్. సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మురళీకృష్ణం రాజు, నీటిపారుదల సంఘాల ఛైర్మన్ వెలమటి రామచంద్రప్రసాద్, సాగునీటి సంఘాల అధ్యక్షులు చలసాని వెంకట రాంబాబు, నెరుసు వెంకటరమణ, పర్వతనేని రంగారావు, స్థానిక రైతులు, స్థానిక ప్రముఖులు, ప్రభృతులు, కలెక్టర్ వెంట ఉన్నారు. . ఇరిగేషన్ కెనాల్స్ నుండి అనధికార సాగునీటి వినియోగం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.



# కొల్లేటి కోట శ్రీ పెద్దింట్లమ్మ తల్లి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



ఏలూరు, మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
కొల్లేటి కోట శ్రీ పెద్దింట్లమ్మ తల్లి వారి వార్షిక ఉత్సవాలు 01.03.2025 నుండి 13.03.2025 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తెలియ చేసారు . ఈ సందర్భంగా భక్తుల రద్దీ పెరగనున్న నేపథ్యంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ ఏలూరు డిఎస్పి, డి శ్రావణ్ కుమార్ యొక్క ఆదేశాలపై కైకలూరు రూరల్ ఇన్స్పెక్టర్ వి. రవికుమార్ , రూరల్ ఎస్ ఐ రాంబాబు దేవాలయ అధికారులతో మరియు ఆలయం పరిసర ప్రాంతాలలో వ్యాపార సముదాయాల యజమానులతో సమావేశం నిర్వహించారు. భక్తులు అనుకూలంగా దర్శన భాగ్యం చేసుకునేలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సీసీ కెమెరాల ఏర్పాట్లు దేవాలయం ప్రాంగణం చుట్టూ సీసీ కెమెరాలను అమర్చారు. డ్రోన్ కెమెరాతో పర్యవేక్షణ చేస్తున్నట్లుటీ తెలియచేసారు ఆలయ ప్రాంగణంలో పోలీసు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతను అందుబాటులో ఉంచాం అని తెలియచేసారు. ఉత్సవ సమయంలో భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకున్నా అన్నారు పదవ తేదీన జల దుర్గ గో కర్ణ స్వామి వారి కళ్యాణ మహోత్సవం – ఈ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కానున్నందున, ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. 13వ తేదీన తెప్పోత్సవం దృష్ట్యా భక్తుల రద్దీ మరియు సముదాయాన్ని దృష్టిలో ఉంచుకుని ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు కైకలూరు పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తులు ఉత్సవాల్లో భక్తి శ్రద్ధలతో పాల్గొని ఆలయ పాలనాకర్తల సూచనలను పాటించాలని కోరడమైనది. కైకలూరు రూరల్ పోలీసులు, దేవాలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైనటువంటి బందోబస్తు ఏర్పాటు చేసినట్లుగా కైకలూరు రూరల్ ఇన్స్పెక్టర్ వి. రవికుమార్ తెలియచేసారు.

## ఆడుకుంటున్న చిన్నారి పై పిచ్చికుక్క దాడి



గోకవరం మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
చిన్నారి పై పిచ్చికుక్క దాడి చేసిన సంఘటన శనివారం గోకవరం మండలం కేంద్రంలో జరిగింది. గోకవరం మేజర్ పంచాయతీ పరిధిలోని సంజీవయ్య నగర్ లో ఆడుకుంటున్న చిన్నారి పై పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వెంటనే కుటుంబ సభ్యులు చిన్నారిని గోకవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా వైద్య సిబ్బంది ఆ బాలికకు వైద్య సేవలు అందించారు. గ్రామంలో కుక్కలు, కోతుల ఎక్కువగా సంచరిస్తున్నాయని గ్రామస్థులు ఫీవర్ స్థాయిలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి కుక్కలు, కోతులను తరలించే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారు. దీనిపై అధికారులు ప్రజాప్రతినిధులు స్పందిస్తారో లేదో వేచి చూడవలసిందే.

# ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోం

**-వైసీపీకి టీడీపీ ఎమ్మెల్సీ, చీఫ్ విప్ అనురాధ హెచ్చరిక**



మంగళగిరి మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
ప్రజా సంక్షేమం కోసం, రాష్ట్ర ప్రగతి కోసం నిరంతరం శ్రమిస్తున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు కారుకూతలు కూస్తే సహించేది లేదని తెలుగుదేశం పార్టీ ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్సీ, శాసనమండలి ఛీఫ్ విప్ శ్రీమతి పంచుమర్తి అనురాధ హెచ్చరించారు. శనివారం నాడు మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో జగన్ అన్ని వ్యవస్థల్ని నిర్వీర్యం చేశారని, ల్యాండ్, శాండ్, వైన్, మైనింగ్ మాఫియాలతో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని ఆమె మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం నిన్న ప్రవేశపెట్టిన ప్రజాహిత బడ్జెట్ పై సాక్షి మీడియా విషం చిమ్ముతోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.3 లక్షల 22 వేల కోట్లతో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం బడ్జెట్ రూపొందించామని చెప్పారు. తల్లికి వందనం పథకంకి రూ.9,407 కోట్లు కేటాయిస్తే రూ. 8 వేల కోట్లే కేటాయించామని తప్పుడు ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. అమ్మ ఒడికి ఇంట్లో ఎంత మంది విద్యార్థులున్నా అందరికీ రూ.15 వేలిస్తానని ఒక్కరికే రూ.13 వేలిచ్చి మోసం చేసింది మీరు కాదా? ఆమె ప్రశ్నించారు. మద్యం రేట్లు పెంచి డిజిటల్ పేమెంట్లు లేకుండా చేసి వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్లలో అమ్మఒడికి రూ. 26 వేల కోట్లు కేటాయించి...నాన్న బుడ్డితో రూ.94 వేల కోట్లు దోచుకున్నారని ఆమె విమర్శించారు. దీపం పథకంకి రూ.2600 కోట్లు కేటాయించామని, సిలిండర్ బుక్ చేసుకున్న 48 గంటల్లో డబ్బులు జమ చేస్తున్నామని ఆమె తెలిపారు. మహిళా శిశు సంక్షేమానికి రూ.4332 కోట్లు కేటాయిస్తే దానిపై తప్పుడు ప్రచారం చేస్తారా? అని మండిపడ్డారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ కింద రూ. 10 లక్షలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేసింది జగన్ కాదా? అని అనురాధ ప్రశ్నించారు. రైతు భరోసా ప్రతి రైతుకు రూ. 12,500 ఇస్తామని, కేవలం 7,500 ఇచ్చి రైతుల్ని మోసం చేసిన మీరు అన్నదాత సుఖీభవ గురించి మాట్లాడుతారా? అని నిలదీశారు. యువతకు 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని బడ్జెట్లో చెప్పామన్నారు. "ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సి అని నిరుద్యోగులను మోసం చేసింది జగన్ కాదా? ఉన్నత చదువులు చదివిన యువతకు చేపలు, మటన్ అమ్ముకోమంటూ అవహేళన చేసింది మీరు కాదా? వెలిగొండ మొదటి టన్నెల్ పూర్తి చేసింది చంద్రబాబు కాదా ? ఎవరికో పుట్టిన బిడ్డకు పేరు పెట్టుకోవడానికి సిగ్గు అనిపించడం లేదా?" అని అనురాధ ప్రశ్నల వర్షం కురిపించారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కాకుండానే ప్రారంభం చేసి నేడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ గురించి మాట్లాడటం సిగ్గుచేటు అని ఎద్దేవా చేశారు. 2014 -19 టీడీపీ హయాంలో వెలుగొండకి రూ.1319 కోట్లు కేటాయించామని ఆమె గుర్తు చేశారు. గత 5 ఏళ్ళు వెలుగొండకి మీరు చేసింది ఏంటి? అని నిలదీశారు. లోకేష్ ని ఏకవచనం కంటే దారుణంగా మాట్లాడిన రోజా నోటికి కళ్లెం పడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అనురాధ హెచ్చరించారు. అమరావతి సెల్ఫ్ సస్టయినబుల్ ప్రాజెక్టు.. దానికి వైసీపీ నాయకులకు అర్థం తెలుసా? అని ప్రశ్నించారు. అమరావతికి ప్రభుత్వ నిధులు అసవరం లేదని, రైతుల మిగులు భూములు అమ్మితే రూ.2 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని ఆమె చెప్పారు. జగన్ మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేసి నాశనం చేశారని, రెండు లక్షల మంది కార్మికులను రోడ్డున పడేశారని ఆమె ఆరోపించారు. "ఎల్లకాలం అబద్ధాలతో ప్రజలను వైసిపి మోసం చేయలేదు. మీరు అబద్ధం ఒకసారి చెప్తే మేము చేసిన అభివృద్ధిని పదిసార్లు చెప్తాం" అని అనురాధ చెప్పారు.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

ఆదివారం 02 మార్చి 2025

# 3న బాలయోగి వర్ధంతి

అమలాపురం మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



దివంగత లోక్ సభ స్పీకర్ జిఎంసి బాలయోగి 23వ వర్ధంతి మార్చి 3వ తేదీ. ఈ సందర్భంగా బాలయోగి ఘాట్ వద్ద ఆయనకు ఘనంగా నివాళు లర్పించేందుకు స్వర్గీయ బాలయోగి కుమారుడు, అమలాపురం ఎంపి గంటి హరీష్ మాధుర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, స్వర్గీయ బాలయోగి అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని బాలయోగి సేవలను స్మరించుకుంటూ, ఆయన సమున్నత వ్యక్తిత్వానికి మన ఘన నివాళులు అర్పించుదామని ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

## సి సి ఎఫ్ సొసైటీ మాజీ అధ్యక్షులు

# సహదేవ మృతి

మలికిపురం మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




మలికిపురం మండలం చింతలమోరి గ్రామ సి సి ఎఫ్ సొసైటీ మాజీ అధ్యక్షులు దళిత ఉద్యమ నేత ఎస్సి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు రాపాక సహదేవుడు శుక్రవారం మృతి చెందారు. సహదేవుడు సిసిఎస్ సొసైటీ అధ్యక్షునిగా అనేక సేవలందించారు.ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం .ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది.


# శ్రీ చైతన్య స్కూల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



సఖినేటిపల్లి మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సఖినేటిపల్లి మండలంలోని సఖినేటిపల్లి శ్రీ చైతన్య స్కూల్ నందు జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సఖినేటిపల్లి మండల ఎం ఈ ఓ డి.కిషోర్ కుమార్ పాల్గొని,విద్యార్థులు చేసిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ విద్యార్థులలో మేధాశక్తి ని పెంచే విధంగా ఉపాధ్యాయులు సహకారం బాగుందని ఆయన ప్రశంసించారు.సైన్స్ పట్ల విద్యార్థులలో అవగాహన పెంచే విధంగా మరిన్ని కార్యక్రమాలు చేయాలని సూచించారు.విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు మంచి పుస్తకాలు చదవాలని, పెద్దలను గౌరవిస్తూ సమాజంలో మంచి ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ఆర్ ఐ బి .రాజ్ కుమార్,శ్రీ రామచంద్ర రాజు,ప్రిన్సిపాల్ ఎన్ .రజనీ,డీన్ అరుణ్ కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మందేశ్వర స్వామికి విశేషంగా తైలాభిషేకాలు



కొత్తపేట, మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునుంచే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు శనిదోష నివారణకు స్వామి వారికి తైలాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి, ఉప కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తైలాభిషేకాల ద్వారా రూ. 99,040, అన్న ప్రసాద విరాళాలుగా రూ. 19,6,95 వెరసి రూ.1,18,7,35 ఆదాయం వచ్చిందిని ఆయన తెలిపారు.

# కోటిపల్లి - నర్సాపురం రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలి

## జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

: అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలు చిరకాలంగా ఎదురు చూస్తున్న కోటిపల్లి %-% నర్సాపురం రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. శనివారం అమలాపురం కలెక్టరేట్ లో ఆమె రైల్వే, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. రైల్వే లైన్ ఏర్పాటులో భూ సేకరణ నష్టపరిహారాల చెల్లింపు, నష్టపరిహారాల పెంపుపై తీసుకున్న చర్యలు నూతన అలైన్మెంట్, సమగ్ర కార్యాచరణ నివేదికలు, ట్రాఫిక్ సర్వే ఎక్విప్మెంట్ ఏర్పాటు తదితర అంశాల పురోగతిపై సమీక్షించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వే ఇంజినీర్లు, రెవిన్యూ అధికారులు సమన్వయంతో రైల్వే లైన్ పనుల్లో తలెత్తే సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలని ఆమె సూచించారు. మళ్లీ భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తయిన ప్రాంతాల్లోని భూమిని రైల్వే అధికారులు స్వాధీన పరుచుకొని రైల్వే నిర్మాణ పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అయినవిల్లి, అమలాపురం రూరల్ మండల గ్రామాల్లో రైల్వే లైనుకు





సంబంధించి భూసేకరణ పూర్తయిందన్నారు. రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లో భూ సేకరణ పూర్తయిన భూములను సర్వే చేసి హద్దులను సూచిస్తూ రైల్వే అధికారులకు అప్పగించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉన్న కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైన్ పనుల్లో ఉత్పన్నమైన వివిధ సమస్యలను అధికారులు సమన్వయంతో దశల వారీగా అధిగమిస్తూ రైల్వే ట్రాక్ నిర్మాణంలో ఆశించిన పురోగతిని సాధిస్తూ కోనసీమ ప్రాంత వాసుల చిరకాల వాంఛను నెరవేర్చాలన్నారు. ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే కాకినాడ నుంచి విజయవాడకు ప్రత్యామ్నాయ రెండో రైలు మార్గం అమలాపురం మీదుగా అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ చీఫ్ ఇంజనీర్ కే.సూర్యనారాయణ, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఏ.బద్దయ్య, సహాయ కార్య నిర్వాహక ఇంజనీర్ పి.అర్జున్ రావు, డిఆర్ఓ బి.ఎల్.ఎన్.రాజకుమారి, ఆర్డీవోలు పి.శ్రీకర్, కే.మాధవి, ఉప తహసిల్దార్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రజలు మళ్ళీ మోసపోయారు

- కూటమి ప్రభుత్వ బడ్జెట్ గుండు సున్నా
- మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ ప్రజలు మళ్ళీ మోసపోయారు అనడానికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024 – 25 వార్షిక బడ్జెట్ ఒక ఉదాహరణ అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శు క్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్లకు ఫ్యాన్సీ నెంబర్ల మాదిరిగా రూ.3.22,359 బడ్జెట్ ప్రవేశపెట్టి శాసనసభ సాక్షిగా దగా చేసారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఎన్నో హామీల అమలుకు నిధులు కేటాయించకుండా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల నెత్తిన శఠగోపం పెట్టినట్టు ఉందని, ఈ బడ్జెట్ గుండు సున్నా ధ్వజమెత్తారు. ఉచిత బస్సు, 18 ఏళ్ళు నిండిన మహిళలకు ప్రతి నెలా రూ.1500, ఏభై ఏళ్ళు నిండిన బీసీలకు పెన్షన్, నిరుద్యోగ భృతి, రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు వంటి హామీలను అమలు చేయకుండా చంద్రబాబు మోసం చేస్తున్నారని విమర్శించారు. దీపం పథకం ఇవ్వకుండా మహిళలను మోసం చేస్తున్నారని చెప్పారు. ధరల స్థిరీకరణ కోసం జగన్ ప్రభుత్వం రూ.3000 కోట్లు విడుదల చేస్తే ఈ కూటమి ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. ఏరు దాటగానే తెప్ప తగలేసిన చందంగా ఈ ప్రభుత్వ తీరు ఉందన్నారు. తల్లికి వందనం పథకానికి రూ.25 వేల కోట్లు అవసరం అయితే కేవలం రూ.9 వేల కోట్లు కేటాయించారన్నారు. ప్రజల పక్షాన పోరాడుతూ ప్రశ్నించడానికే నేను ఉన్నాను అని చెప్పే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హామీల అమలుకు బడ్జెట్ లో నిధులు కేటాయించకుండా మోసం చేస్తుంటే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పక్కనే కూర్చుని ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మేనిఫెస్టోలో చెప్పినట్టు 18 ఏళ్ళు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీ అమలుకు రూ.32 వేల కోట్లు ఖర్చు అవుతుండగా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు.



దీనిపై వైసీపీ ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. మంత్రుల పనితీరుకు ర్యాంకులు ఇచ్చిన చంద్రబాబు వారు చేస్తున్న అవినీతిపై కూడా ర్యాంకులు ఇస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు. అలా ర్యాంకులు ఇస్తే మొదటి ర్యాంకు నారా లోకేష్ కే వస్తుందని, కొత్తపేట నియోజకవర్గంలో ఇసుక దోపిడీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రెండో స్థానంలో ఉంటారని ఎద్దేవా చేశారు. జగన్ కి భయపడి వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వడానికి ఈ ప్రభుత్వం వెనుకడుగు వేస్తోందన్నారు. హామీల అమలులో చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసంపై ప్రజల పక్షాన నిలబడి వైసీపీ పోరాటం చేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో వైసీపీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్చార్జి, అంబేద్కర్ కోనసీమ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధర్, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు గొల్లపల్లి డేవిడ్ రాజు, దొమ్మేటి అర్జునరావు, తమ్మన శ్రీనివాస్, కప్పల శ్రీధర్, బొక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తజన సంద్రమైన వాడపల్లి వెంకన్న క్షేత్రం



## - రూ. 44,31,149 ఆదాయం

ఆత్రేయపురం మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామున ఆలయ అర్చకులు సుప్రభాత సేవ, తొలిహారతి నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఏడు శనివారాల వాడపల్లి వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడి విశ్వవ్యాప్తం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఏడు ప్రదిక్షణలు చేసి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రదిక్షణలు చేసే భక్తులతో మాడవీధులు కిటకిటలాడాయి. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి వాడపల్లికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిపారు. సాయంత్రం వరకు ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 7,55,500, విశిష్ట దర్శనం ద్వారా రూ.13,58,400, వేదాశీర్వచనం ద్వారా రూ.12,30,948, సుప్రభాత టిక్కెట్ల ద్వారా రూ. 18,000, స్వామి వారి లడ్డూ ప్రసాద విక్రయం ద్వారా రూ. 5,05,845, పులిహోర ప్రసాద విక్రయం ద్వారా రూ. 91,630, ఆన్లైన్ విరాళాల ద్వారా రూ.1,27,566, నిత్య అన్నదాన విరాళాలు రూ.2,37,511, శాశ్వత అన్నదాన విరాళాలు రూ.83,045 తో పాటు వివిధ రకాల సేవలు, విరాళాల ద్వారా మొత్తం రూ. 44,31,149 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి చక్రధరరావు తెలిపారు.





తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com


# ప్రపంచ కర్మాగారంగా భారత్

## ప్రధాని మోదీ



**ఢిల్లీ : ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచ కర్మాగారంగా భారత్ రూపొందుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచ దేశాలు కొన్ని దశాబ్దాలుగా భారత్‌ను ఓ ఉప శాఖగా చూశాయని.. కానీ ప్రస్తుతం ఆ విధానం పూర్తిగా మారిపోయిందని పేర్కొన్నారు. దేశ రాజధానిలో నిర్వహించిన ఎన్ఎక్స్‌టీ కాన్‌క్లేవ్‌లో భాగంగా ప్రధాని మాట్లాడుతూ.. భారత్ గురించి చాలా సానుకూల వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో ప్రపంచం మొత్తం ఆసక్తిగా గమనిస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచ దేశాల ప్రజలు భారత్‌కు రావాలని కోరుకుంటున్నారన్నారు.**

ఇన్నేళ్లు శ్రామిక శక్తిగా పేరుపొందిన భారతదేశం ప్రస్తుతం ప్రపంచ శక్తిగా మార్పు చెందిందని మోదీ అన్నారు. సెమీకండక్టర్లు, విమాన వాహక నౌకల తయారీ వంటి వాటిలో వేగంగా అభివృద్ధి చెందుతూ.. ఆటోమొబైల్ ఉత్పత్తిదారుగా మారిందని పేర్కొన్నారు. దేశంలో లభించే సూపర్‌ఫుడ్‌లైన మఖానా, మిల్లెట్‌లు, ఆయుష్ ఉత్పత్తులు, మనం పాటించే యోగా, ధ్యానం వంటి వాటిని విదేశీయులు ఆచరిస్తున్నారన్నారు.

భాజపా నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజలు మూడోసారి పట్టం కట్టడం వారికి తమపై ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తోందని సంతోషం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ప్రారంభిస్తున్న కొత్త గ్లోబల్ న్యూస్ ఛానల్ దేశం సాధించిన విజయాలను.. స్థానిక ఉత్పత్తులకు ప్రచారం కల్పించాలనే తన ప్రయత్నాన్ని విదేశాలకు తెలియజేస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ అభివృద్ధిలో ముందడుగు వేస్తూ అనేక ప్రపంచవ్యాప్త కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తోందని అన్నారు. ఇటీవల పెద్దఎత్తున నిర్వహించిన మహాకుంభమేళా భారతదేశం పాటించే నిర్వహణానైపుణ్యాలు, ఆవిష్కరణలను ప్రపంచానికి చాటిచెప్పిందని అన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కాలంచెల్లిన అనేక చట్టాను రద్దు చేసి.. కొత్త వాటిని రూపొందించామని తెలిపారు.

# జెలెన్‌స్కీకి ఇలా జరగాల్సిందే

## రష్యా ఎద్దేవా



**రష్యా : అమెరికా, ఉక్రెయిన్ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, జెలెన్‌స్కీ మీడియా ఎదుటే వాగ్వాదానికి దిగడం యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ పరిణామాలపై రష్యా స్పందిస్తూ ఉక్రెయిన్‌పై తీవ్ర పదజాలంతో విమర్శలు గుప్పించింది. జెలెన్‌స్కీకి ఇలా జరగాల్సిందేనని ఎద్దేవా చేసింది.**


%ఈ వాడీవేడి చర్చపై రష్యా మాజీ అధ్యక్షుడు, రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ ఛైర్మన్ దిమిత్రి మెద్వెదేవ్ మాట్లాడుతూ.. "అమెరికా పట్ల అమర్యాదగా ఉన్న ఉక్రెయిన్‌కు ఈ పరిణామం గట్టి చెంపదెబ్బ. జెలెన్‌స్కీకి ఇలా జరగాల్సిందే" అని అన్నారు. రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా స్పందిస్తూ.. "ఉక్రెయిన్ అధ్యక్షుడు తమకు అన్నం పెట్టిన చేతినే గాయపరుస్తున్నారు. తమకు సాయం చేసిన వారితోనే వాగ్వాదానికి దిగారు. ఆయనపై దాడి చేయకుండా ట్రంప్, జేడీవాన్స్ సంయమనం పాటించడం అద్భుతమే" అని దుయ్యబట్టారు.

### ఆ దేశాధినేతలకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు..

మరోవైపు తాజా పరిణామాలపై ఐరోపా సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల అధినేతలు సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. కీవ్ ఒంటరి కాదంటూ జెలెన్‌స్కీకి అండగా నిలిచారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సహా పలువురు దేశాధినేతలు అమెరికా తీరును తప్పుబడుతూ పోస్టులు చేశారు. వీరందరికీ ఉక్రెయిన్ అధ్యక్షుడు పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేశారు.

రష్యా చేస్తున్న యుద్ధానికి తెర దించడానికి శాంతి ఒప్పందం కుదర్చడం, దానికి బదులుగా ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజాల తవ్వకానికి అనుమతించాలని అమెరికా చేసిన ప్రతిపాదనపై చర్చించడానికి జెలెన్‌స్కీ శుక్రవారం శ్వేతసౌధానికి వచ్చారు. భవిష్యత్తులో తమపై రష్యా ఏదైనా దురాక్రమణకు పాల్పడితే రక్షణ కల్పించాలని ఆయన ఒత్తిడి చేశారు. ఇది ట్రంప్‌నకు ఆగ్రహం తెప్పించింది. దీంతో చర్చలు అర్ధంతరంగా ముగిశాయి. ఒప్పందంపై ఎలాంటి సంతకాలు చేయకుండానే జెలెన్‌స్కీ వైట్‌హౌస్ నుంచి బయటికొచ్చారు. అనంతరం దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఇలాంటి ఘర్షణ ఇరుపక్షాలకు మంచిది కాదన్నారు.

# జెలెన్‌స్కీ శాంతిని కాంక్షించే వ్యక్తి కాదు: ట్రంప్




**రష్యా : ఖనిజాల తవ్వకం ఒప్పందంపై చర్చల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీల మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య అత్యవసరంగా కాల్పుల విరమణ ఒప్పందం జరగాలని తాను కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. శాంతి చర్చలకు జెలెన్‌స్కీ తిరిగి వచ్చినప్పటికీ.. అందుకు తాను సిద్ధంగా లేనని తెలిపారు. ఈ భేటీలో ఘర్షణ అనంతరం విలేకరులతో ట్రంప్ మాట్లాడారు.**

'మేము ఈ రోజు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తో భేటీ అయ్యాం. ఈ సమావేశంలో ఆయన కొంచెం అతి చేసినట్లు నాకు అనిపించింది. మేము శాంతి కోసం చూస్తున్నాం. కానీ, ఆయన దాన్ని కోరుకుంటున్నట్లుగా నాకు అనిపించడం లేదు. మరో పదేళ్లు యుద్ధానికి వెళ్లి ఆటలాడాలని మేము అనుకోవడం లేదు. శాంతి నెలకొల్పాలని నేను చూస్తుంటే.. ఆయన మరొక దాన్ని ఆశిస్తున్నారు. మాకు తక్షణమే శాంతి కావాలి. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇదే కోరుకుంటున్నారు. ఈ యుద్ధాన్ని ముగించాలనుకుంటున్నారు' అని ట్రంప్ పేర్కొన్నారు. ఈసందర్భంగా జెలెన్‌స్కీతో శాంతిచర్చలు కొనసాగిస్తారా అని ఓ విలేకరి ప్రశ్నించారు. ఆయన అందుకు రావాలనుకుంటున్నారు, కానీ తాను అందుకు సిద్ధంగా లేనని ట్రంప్ బదులిచ్చారు. జెలెన్‌స్కీ శాంతి కోరుకోవడం లేదు, ఆయన అలాంటి వ్యక్తే కాదంటూ విమర్శించారు. రష్యా, ఉక్రెయిన్ ల మధ్య శాంతిఒప్పందం కుదర్చడానికి బదులుగా కీవ్‌లోని అరుదైన ఖనిజాల తవ్వకానికి అనుమతించాలని అమెరికా ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంపై చర్చించేందుకు ట్రంప్‌తో జెలెన్‌స్కీ భేటీ అయ్యారు. భవిష్యత్తులో తమపై రష్యా ఏదైనా దురాక్రమణకు పాల్పడితే రక్షణ కల్పించాలని ఆయన ఒత్తిడి చేశారు. ఇది ట్రంప్‌నకు ఆగ్రహం తెప్పించింది. దీనిపై ఇరువురి నేతల మధ్య వాగ్వాదం జరిగింది.

## భవిష్యత్తులో అమెరికా


# అధ్యక్షుడు ఆయనే..: మస్క్



**అమెరికా : ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను ఉద్దేశిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో అగ్ర రాజ్యానికి ఆయనే అధ్యక్షుడు అవుతారని అంచనా వేశారు. దేశానికి మంచి నాయకుడిగా ఉంటారంటూ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా కొనియాడారు.**

"అమెరికా ఉపాధ్యక్షుడి హోదాలో ఉన్న జేడీ వాన్స్ అత్యుత్తమంగా పని చేస్తున్నారు. ఆయన దేశానికి కాబోయే అధ్యక్షుడు" అంటూ మస్క్ ఓ పోస్టుకు సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ఈ పోస్టు నెట్టింట వైరల్‌గా మారింది. కాగా.. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంలో మస్క్ కీలకపాత్ర పోషించారు. ట్రంప్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి టెస్లా అధినేత నేతృత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్).. ప్రభుత్వ విభాగాల్లో ప్రక్షాళన కోసం పలు కీలక విధానాలు తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన అమెరికాకు భవిష్యత్తులో కాబోయే అధ్యక్షుడి విషయంలో ఈ వ్యాఖ్యలు చేశారు.


# సౌర జ్వాలలను ఆవిష్కరించిన ఆదిత్య-ఎల్1



**దిల్లీ: సూర్యుడిపై లోతైన పరిశోధనల కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన ఆదిత్య-ఎల్1.. సౌర గోళానికి సంబంధించిన అద్భుత చిత్రాలను అందించింది. సూర్యుడి దిగువ పొరల్లో ఉత్పన్నమైన ఒక సౌర జ్వాలను క్లిక్‌మనిపించింది. సూర్యుడిలో సంభవించే విస్ఫోటక చర్యల గురించి ఇది లోతైన అంశాలను వెలుగులోకి తెచ్చిందని శాస్త్రవేత్తలు తెలిపారు.**

సౌర జ్వాలలనేవి భానుడిలో భారీ విస్ఫోటాలు. వీటి ద్వారా శక్తి, కాంతి, అత్యంత వేగవంతమైన రేణువులు రోదసిలోకి దూసుకొస్తాయి. తద్వారా అంతరిక్ష వాతావరణంపై ప్రభావం చూపుతాయి. పుడమిపై రేడియో కమ్యూనికేషన్లు, కక్ష్యలో ఉపగ్రహ కార్యకలాపాలకు అవరోధం కలిగిస్తాయి. సౌర జ్వాలలు.. సూర్యుడిపై దేదీప్యమానంగా కనిపిస్తుంటాయి. ఆదిత్య-ఎల్1లోని సోలార్ అల్ట్రావయలెట్ ఇమేజింగ్ టెలిస్కోపు (సూట్) అనే పరికరం ఫిబ్రవరి 22న ఈ సౌరజ్వాలను క్లిక్‌మనిపించినట్లు పుణెలోని ఇంటర్-యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రోనమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐయూసీఏఏ) పరిశోధకులు తెలిపారు. ఇది ఎక్స్6.3 తరగతి సౌర జ్వాల అని, అత్యంత తీవ్రమైన విస్ఫోటాల జాబితాలో ఇది చేరిందని వివరించారు. ఈ జ్వాలలో దేదీప్య కేంద్ర భాగాన్ని కూడా గుర్తించామన్నారు.

# మణిపూర్ సంక్షోభం.. కేంద్రం కీలక ఆదేశాలు



**న్యూఢిల్లీ: సంక్షోభంలో ఉన్న మణిపూర్‌కు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. జనసంచారంపై ఉన్న ఆంక్షలను ఎత్తేయాలని.. మార్చి 8వ తేదీ నుంచి ఆ రాష్ట్రంలో సాధారణ స్థితి నెలకొల్పాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇవాళ జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో హోం శాఖ మంత్రి అమిత్ షా సంబంధిత ఆదేశాలను జారీ చేశారు.**

మార్చి 8వ తేదీ నుంచి మణిపూర్‌లో అన్ని రోడ్లపై ప్రజలు స్వేచ్ఛగా తిరగాలి. ఎవరైనా జనసంచారానికి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోండి అని అమిత్ షా మణిపూర్ అధికార యంత్రాంగానికి సూచించారు. మణిపూర్‌లో రాష్ట్రపతి విధింపు తర్వాత.. అక్కడి శాంతి భద్రతలపై జరిగిన తొలి సమీక్షా సమావేశం ఇదే కావడం గమనార్హం. ఈ సమావేశానికి మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, ఇతర ఉన్నతాధికారులు, సైన్యం.. పారామిలిటరీ తరపున ప్రతినిధులు హాజరయ్యారు. 2023 మే నుంచి ఈ ఈశాన్య రాష్ట్రంలో తెగల వైరంలో అల్లకల్లోల పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ సాధారణ పరిస్థితులు నెలకొనేలా ప్రయత్నాలను కేంద్రం ఇప్పుడు ముమ్మరం చేసింది.

దాదాపు రెండేళ్లుగా జాతుల మధ్య వైరంతో రగులుతున్న మణిపుర్‌లో కల్లోల పరిస్థితుల నేపథ్యంలో.. ఇటీవల ఫిబ్రవరి 13వ తేదీన సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన కేంద్ర ప్రభుత్వం అధికారాలన్నింటినీ అక్కడి గవర్నర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అయితే కల్లోల పరిస్థితులను ఆసరాగా చేసుకుని భద్రతా బలగాలకు చెందిన ఆయుధాలను కొందరు ఎత్తుకెళ్లారు. ఈ నేపథ్యంలో.. అక్కడి ప్రజలకు గవర్నర్ అజయ్ కుమార్ భల్లా కీలక విజ్ఞప్తి చేశారు. తమ వద్ద ఉన్న అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను ఏడు రోజుల్లోగా అప్పగించాలని అన్ని వర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిర్ణీత సమయంలోగా ఆయుధాలను తిరిగి ఇస్తే ఎలాంటి చర్యల ఉండవని.. లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సమగ్రాభివృద్ధికి ఏపీ బడ్జెట్ దోహదం

**పర్యాటక రంగానికి పరిశ్రమ హెూదా**

**పర్యాటక పెట్టుబడులు కోసం బెర్లిన్ వెళ్తున్న**

**4నుండి 6 వరకు ఐటిబి బెర్లిన్ సదస్సు : మంత్రి దుర్గేష్**



రాజమహేంద్రవరం మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే విధంగా ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట గ్రామం డి మార్ట్ ప్రక్కన గల మంత్రి దుర్గేష్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో మహిళలు, శిశు సంక్షేమానికి పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. జలవనరులకు బడ్జెట్‌లో సింహభాగాన్ని కేటాయించారన్నారు. గ్రామ పంచాయితీలలో జల జీవన్ ద్వారా నీటి అవసరాలు తీర్చడం, ఎన్‌ఆర్‌జిసిలో రోడ్లు నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. ఇది రాష్ట్రంలోని అందరి ప్రజలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్ అన్నారు. గత ప్రభుత్వంలో రోడ్లు నిర్మాణానికి తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్లను అద్దంలా తీర్చి దిద్దుతున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు నుండి మెరకచర్ల వరకు గోదావరి నీరును తీసుకువెళ్ళి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా ధాన్యం అమ్మిన 24 నుండి 48 గంటలలోగానే రైతుల ఖాతాలో డబ్బులు వేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన 3నెలలకు కూడా డబ్బులు రాని పరిస్థితి ఉందన్నారు. పర్యాటక రంగానికి ఇతోధికమైన సహకారం అందుతుందన్నారు. అందులో భాగంగానే కూటమి ప్రభుత్వం నూతన పర్యాటక పాలసీలో పర్యాటక రంగానికి పరిశ్రమ హెూదా కల్పించిందన్నారు. దీని వల్ల పరిశ్రమలకు లభించే రాయితీలు పర్యాటక ప్రాజెక్టులకు దక్కుతాయన్నారు. తెలుగు భాషా వికాసానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. గత ప్రభుత్వంలో కేవలం ఇంగ్లీషు మీడియం మాత్రమే కొనసాగించి తెలుగుభాషను చంపేసిందని ఆరోపించారు. అభివృద్ధి, పురోగతికి నాంధిగా ఈ బడ్జెట్ నిలుస్తుందన్నారు. గ్రీన్ ఎనర్జీ, డ్రోన్‌ల ద్వారా వ్యవసాయాభివృద్ధికి ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. రైతులకు వ్యవసాయం లాభసాటిగా ఉండాలన్నది కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. ప్రతి రైతుకు రూ.20వేలు సాయం చేస్తుందని, కౌలు రౌతును కూడా ఆదుకుంటుందన్నారు. అయితే ప్రతిపక్షం ఏదో విమర్శలు చేయాలి కాపట్టి విమర్శిస్తుందని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న పర్యాటక అవకాశాల గురించి అంతర్జాతీయ యవనికపై తెలియజేసి రాష్ట్రానికి పెట్టుబడులు సాధించానికి ఈనెల 4నుండి 6వ తేదీ వరకు బెర్లిన్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ టూరిజం బోర్స్ బెర్లిన్ 2025 సదస్సుకు హాజరవుతున్నట్లు వెల్లడిరచారు. తనతో పాటుగా టూరిజం శాఖ ఎండి ఆమ్రాపాల్ హాజరుతున్నట్లు చెప్పారు. అమెరికా, ఇతర దేశాల్లో జరుగుతున్న మరో 3 సదస్సులకు ఆహ్వానం అందినప్పటికీ బెర్లిన్ సదస్సుకు హాజరైతే రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్న ఆలోచనతో బెర్లిన్ వెళుతున్నామన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పటికీ రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తనను బెర్లిన్ పంపుతున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. బెర్లిన్ సదస్సు ట్రావెల్, టూరిజం వృద్ధికి ప్రేరణ ఇస్తుందన్నారు. ఆదివారం హైదరాబాద్ నుండి బయలు దేరి బెర్లిన్ వెళతానన్నారు. బెర్లిన్‌లో సుమారు 30 మంది పారిశ్రామిక వేత్తలతో సమావేశం అయ్యి పెట్టుబడులకు ఆహ్వానిస్తామన్నారు. తిరిగి 9వ తేదీన రాష్ట్రానికి చేరుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న సముద్రతీర ప్రాంతంలో, గోదావరి, కృష్ణా, పెన్నా నదీ తీరాలు, సుందర ప్రాంతాల గురించి వివరించి పెట్టుబడులు ఆహ్వానిస్తామన్నారు. ఇక్కడ ఎకో, టెంపుల్, వెల్‌నెస్ టూరిజంకు ఉన్న అవకాశాలను వివరిస్తామన్నారు. గత నెలలో విశాఖపట్నంలో జరిగిన ఇన్వెస్టర్ మీట్, ఢల్లీలో జరిగిన సదస్సులో పాల్గొనడం ద్వారా రాష్ట్రానికి అనేక పెట్టుబడులు ఆకర్షించడం జరిగిందన్నారు. పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఢల్లీలో జరిగిన సదస్సులో పాల్గొన్నందుకు కేంద్ర పర్యాటక శాఖమంత్రి మెచ్చుకున్నారని, గత ఐదేళ్ళలో ఆహ్వానం పంపినా ఏనాడు రాష్ట్రనుంచి ప్రతినిధులు హాజరవ్వలేదని చెప్పారన్నారు. ఈ సదస్సుకు హాజరు కావడం వల్ల అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టులు మంజూరయ్యాయన్నారు. పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్‌లో ప్రాజెక్టులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువని, పర్యాటకం అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. రాష్ట్రంలోని విశాఖపట్నంలోని రుషికొండ బీచ్‌కు బ్లూఫాగ్ సర్టిఫికేషన్ ఉందని, అలాగే కృష్ణ, మచిలీపట్నం, నెల్లూరు, మచిలీపట్నం, కాకినాడ బీచ్‌లకు కూడా బ్లూఫాగ్ సర్టిఫికేషన్ కొరకు కృషి చేస్తామన్నారు. బీచ్‌లు, వారసత్వ ప్రదేశాలు, సాంస్కృతిక సంపదం, బౌద్ధ, ఆద్యాత్మిక ఎంఐసిఈ పర్యాటక తదితర అంశాలను వివరించడంపై తాము దృష్టి సారించామని తెలిపారు. ఐటిబి బెర్లిన్ వేదికపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన పర్యాటక పాలసీ 2024%-%29, పర్యాటకానికి పరిశ్రమ హెూదా, పర్యాటక రంగానికి రాయితీలు అంశాలను వివరించి పెట్టుబడులు ఆకర్షిస్తామన్నారు. 14న పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభ జరుగుతుందని, ఈ సభలో పార్టీని బలోపేతం చేయడంపై పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ దిశా నిర్దేశం చేస్తారన్నారు. ఈ సభకు లక్షలాధిగా కార్యకర్తలు హాజరవుతారని తెలిపారు. ప్రతిపక్ష హెూదా ఇస్తేనే సభకు హాజరవుతామని జగన్ మోహన్ రెడ్డి అనడం ప్రజా సమస్యలను గాలికి వదిలేయడమే అన్నారు. విలేకరుల సమావేశంలో జనసేన నాయకులు అత్తి సత్యనారాయణ, వై శ్రీను, గంటా స్వరూప తదితరులు పాల్గొన్నారు

## ప్లాస్టిక్ రహిత నగరంగా తిరుపతిని ఉంచుదాం...

**కమిషనర్ ఎన్.మౌర్య..**




తిరుపతి మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్ లో భాగంగా ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్థానిక అన్నమయ్య కూడలి నుండి దండి మార్చ్ (ఎమ్మార్ పల్లి) కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మానవాళికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ ను నియంత్రించేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని చేపడుతున్నామని అన్నారు. 120 మైక్రాన్స్ కంటే ఎక్కువ ఉన్న ప్లాస్టిక్ వస్తువులు వినియోగించారాదని అన్నారు. ఈ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంగా గుడ్డ బ్యాగుల, పేపర్ కవర్లు వినియోగించేలా ప్రజలకు దుకాణదారులు అవగాహన కల్పించాలని అన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈ ప్లాస్టిక్ నిషేధానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారని అన్నారు. బయటి ప్రాంతాల నుండి ఎక్కువ ప్లాస్టిక్ కవర్లు వస్తున్నాయని వాటిని అరికట్టాలని కోరారని అన్నారు. కలెక్టర్ తో చర్చించి వాటి నియంత్రణకు చర్యలు చేపడతామని అన్నారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధంపై తనిఖీలు చేస్తామని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ర్యాలీ లో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.సి.పీ. మహా పాత్ర, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డి.ఈ.లు మహేష్, రాజు, రమణ, మధు, లలిత, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, మెప్మా కృష్ణవేణి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## గురువైభవోత్సవం అవార్డు అందుకున్న మంత్రి లోకేశ్

మంత్రాలయం మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ మంత్రాలయంలో గురువైభవోత్సవం అవార్డును అందుకున్నారు. ఈ పురస్కారాన్ని ఆయనకు మంత్రాలయ పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామీజీ అందజేశారు. ఈ సందర్భంగా స్వామీజీ లోకేశ్‌ను శాలువాతో సత్కరించి, ఆధ్యాత్మికతకు, సమాజ సేవకు ఆయన అందిస్తున్న సేవలను ప్రశంసించారు. గురువైభవోత్సవం సందర్భంగా జరిగిన ఈ వేడుకలు భక్తుల సందడితో సాగాయి.

**రాఘవేంద్రస్వామిని లోకేష్ దర్శనం**

అవార్డు అందుకునే ముందు, మంత్రి లోకేశ్ మంత్రాలయ రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సంతోషంగా జీవించాలని భగవంతుడిని ప్రార్థించారు. ముఖ్యంగా, రైతులకు సమయానికి వర్షాలు పడాలని, వారి జీవితాలు సుఖమయంగా మారాలని ఆకాంక్షించారు. ఆయన పూజా కార్యక్రమాల్లో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల ఉత్సాహం పెరిగింది. భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రభుత్వ విధానాలు ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రభుత్వ విధానాలు ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆధ్యాత్మిక కేంద్రాలకు ప్రత్యేక స్థానం ఉందని, మంత్రాలయం వంటి పవిత్రమైన ప్రదేశాలు నిత్యం భక్తజనులతో కళకళలాడాలని అన్నారు. అలాగే, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు.

గురువైభవోత్సవం వేడుకల్లో మంత్రి లోకేశ్ పర్యటన సందర్భంగా భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆయనను చూసేందుకు, ఫొటోలు తీయడానికి భక్తులు ఆసక్తి చూపారు. గురువైభవోత్సవం వేడుకల్లో మంత్రి పాల్గొనడంతో మంత్రాలయం మరింత ఆధ్యాత్మికంగా మారినట్లైంది. చివరగా, లోకేశ్ ఆలయ నిర్వాహకులతో సమావేశమై ఆలయ అభివృద్ధికి సంబంధించి అనేక విషయాలు చర్చించారు.



## ఆశలు ఆవిరి - మట్టి బురదలో కలిసిన ప్రాణాలు..!

హైదరాబాద్‌మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)





తెలంగాణ : శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది కార్మికుల ప్రాణాలు మట్టి బురదలో కలిసిపోయాయి. దాదాపు 11 రెస్క్యూ బృందాలు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. టన్నెల్‌లో కూరుకుపోయినవారి మృతదేహాలను శుక్రవారం అర్ధరాత్రి వరకు శ్రమించి రెస్క్యూ సిబ్బంది బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలుస్తున్నది. ప్రభుత్వం నేడు అధికారికంగా ప్రకటించే అవకాశమున్నది.

**సింగరేణి బృందంతో హై లెవెల్ రెస్క్యూ ఆపరేషన్..**

ముందుగా చిక్కుకుపోయిన కార్మికులను గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్‌తో గుర్తించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జీపీఆర్ ద్వారా జీరో పాయింట్ వరకు చేరుకొని ఆ ప్రదేశమంతా స్కాన్ చేశారు. రిపోర్టు ఆధారంగా స్పాట్లను గుర్తించి కొత్తగూడెం నుంచి అండర్ గ్రౌండ్లో పనిచేసే సింగరేణికి చెందిన అనుభవజ్ఞులైన కార్మికులను రప్పించారు. ఎన్‌డీఆర్‌ఐ, ర్యాట్ మైనర్స్ టీం, సింగరేణి బృందంతో హై లెవెల్ రెస్క్యూ ఆపరేషన్ చేసి టీబీఎం ముందు భాగంలో చిక్కుకున్నారని గుర్తించి మట్టిదిబ్బలు, బురదను తొలగించి మృతదేహాలను బయటకు తీసినట్టు తెలిసింది. శుక్రవారం రాత్రంతా అక్కడ ఉద్విగ్న వాతావరణం నెలకొనగా చివరికి విషాదమే మిగిలింది.

**3 మృతదేహాలు వెలికితీత..**

ప్రమాద స్థలంలో భారీగా పేరుకుపోయిన బురద నుంచి ఇప్పటికి 3 మృతదేహాలను సహాయక బృందాలు బయటకు తెచ్చాయి. శనివారం మధ్యాహ్నంలోపు మొత్తం మృతదేహాలను వెలికితీయాలని రెస్క్యూ టీం ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ఎనిమిది అంబులెన్స్‌లు టన్నెల్ వద్దకు చేరుకున్నాయి. అక్కడి నుంచి మృతదేహాలను నేరుగా హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలిస్తున్నారు. అక్కడ గుర్తింపు పరీక్షలు, ఇతర ఫార్మాలిటీస్ పూర్తయిన తరువాత మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

**నేడు ఎలాగైనా మృతదేహాలన్నిటినీ బయటకు తీస్తాం : అధికారులు**

టన్నెల్ వద్దకు ఉస్మానియా ఫోరెన్సిక్ బృందం చేరుకుంది. ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ హెడ్ శ్రీధర్ చారితో పాటు ఇద్దరు సిబ్బంది, మరో ఇద్దరు పీజీ వైద్యులు, నాగర్ కర్నూల్ డీఎంహెచ్‌వో కూడా టన్నెల్ వద్దకు చేరుకున్నారు. మృతదేహాల వెలికితీత క్రమంలో %ా% కార్మికుల కుటుంబాల రోదనలతో టన్నెల్ వద్ద విషాద ఛాయలు అలుముకున్నాయి. నేడు ఎలాగైనా మృతదేహాలను బయటకు తీసి.. బంధువులకు అప్పగిస్తామని అధికారులు చెబుతున్నారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ దగ్గరకు జేపీ కంపెనీ చైర్మన్, అడ్మినిస్ట్రేషన్ ముఖ్యులు చేరుకున్నారు. మరి కాసేపట్లో మృతుల కుటుంబాలకు పరిహారం, ఇన్సూరెన్స్ విషయంలో స్పష్టత రానుంది.

## ఇంటర్మీడియట్, పదవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి

**- విద్యార్థులకు కర్తవ్య బోధన చేసిన కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా**

ఒంగోలు మార్చి 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా వినూత్న కార్యక్రమం నిర్వహించారు. మునుపెన్నడూ లేని విధంగా జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులతో శనివారం ప్రకాశం భవనము నుంచి జూమ్ మీటింగ్ నిర్వహించారు. పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న తీరుపై ఆరా తీశారు. పలువురు విద్యార్థులతో ఆమె ముఖాముఖి మాట్లాడారు. వారి భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి పదో తరగతి పరీక్షలు పాస్పోర్టు లాంటివని ఆమె వ్యాఖ్యానించారు. ఒత్తిడికి గురికాకుండా సానుకూల దృక్పథంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఈ దిశగా అవసరమైన ఆహ్లాదకర వాతావరణాన్ని జిల్లా యంత్రాంగం కల్పిస్తున్నట్లు చెప్పారు. పదవ తరగతి విద్యార్థులకు ఇప్పటికే ఆల్ - ఇన్ - వన్ గైడ్లు ఇచ్చామని, టూటర్లను కూడా పెట్టామని అన్నారు. వీటిని ఉపయోగించుకుని హాస్టళ్ళలో ఉంటున్న విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని, 90 శాతానికి పైగా మార్కులు సాధించాలని విద్యార్థులలో విశ్వాసం నింపారు. కేవలం పదవ తరగతితోనే చదువు ఆపొద్దని, కనీసం డిగ్రీ పూర్తి చేయాలని చెప్పారు. తనకు 18 ఏళ్లు నిండే వరకు పెళ్లి చేసుకోబోనని ప్రతి ఆడపిల్ల తీర్మానం తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యం పై మరింత శ్రద్ధ పెట్టాలని హాస్టల్ వార్డెన్లను ఆమె ఆదేశించారు. విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా భావించి వారి ఈ విద్య, ఆరోగ్య విషయాలలో జాగ్రత్త వహించాలని దిశా నిర్దేశం చేశారు. స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న తీరుపై ఆరా తీశారు. గతంలో సాధించిన ఉత్తీర్ణతను తెలుసుకున్నారు. ఉత్తీర్ణత పెంచేలా చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో ఆకస్మికంగా హాస్టళ్లను తనిఖీ చేస్తానని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్ , జిల్లా బీసీ సంక్షేమ అధికారి అంజల, పుల్లలచెరువు నుంచి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు



తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com


# ఆ ఐసీసీ రూల్స్..

అశ్విన్

# భారత స్పిన్నర్ల ఆధిపత్యానికి గండి

వన్డేల్లో ఐసీసీ తీసుకొచ్చిన నిబంధనలతో స్పిన్నర్లకు ముప్పు వాటిల్లిందని భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఇప్పటికైనా ఆ రూల్స్‌ను తీసేయాలని.. లేకపోతే వన్డేల మనుగడ ప్రమాదంలో పడుతుందని అశ్విన్ ఆందోళన వ్యక్తంచేశాడు. తాజాగా జరుగుతోన్న ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచులపైనా అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.



“అఫ్గానిస్థాన్, ఇంగ్లండ్ మ్యాచ్‌కు ముందు నేను వన్డే ఫార్మాట్ గురించి కాస్త ఆందోళన పడ్డా. వన్డేల భవితవ్యం ఎలా ఉంటుందోనని ఆలోచించా. ఎందుకంటే టీ20లను చూసేందుకు ప్రేక్షకులు భారీగా వస్తున్నారు. నాలుగు గంటల్లోనే ఫలితం వచ్చేయడంతో చూసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారు. ఇటీవల టెస్టులకూ ప్రేక్షకాదరణ బాగుంది. అఫ్గానిస్థాన్ వంటి టీమ్‌ల దేశవాళీ క్రికెట్‌లో మార్పులు తీసుకొస్తే టెస్టులు మరింత ఆసక్తికరంగా మారతాయి” అని అశ్విన్ తెలిపాడు.

### బ్యాటర్లకు అడ్వాంటేజ్..

“2013-14 సీజన్ వరకు వన్డేల్లో కేవలం ఒక్క బంతితోనే ఇన్నింగ్స్ ఆడించారు. ఎప్పుడైతే రెండు బంతులు వాడటంతోపాటు సర్కిల్ లోపల ఐదుగురు ఫీల్డర్లను అనుమతించారో.. అప్పటి నుంచి స్పిన్నర్ల ఆధిపత్యానికి ముప్పు వాటిల్లింది. మరీ ముఖ్యంగా భారత స్పిన్ ఆధిపత్యాన్ని నాశనం చేసేందుకే ఇలాంటి రూల్స్ తెచ్చినట్లు అనిపిస్తోందనేది నా వ్యక్తిగత అభిప్రాయం. ఆట పైనా తీవ్ర ప్రభావం పడింది. రివర్స్ స్వింగ్ కనుమరుగవుతోంది. ఇక ఫింగర్ స్పిన్నర్ల ప్రభావం కూడా తగ్గిపోతోంది” అని భారత మాజీ క్రికెటర్ వ్యాఖ్యానించాడు.

### 2027 వన్డే ప్రపంచకప్ నిర్వహణ కఠిన సవాలే

“దక్షిణాఫ్రికా వేదికగా 2027 వన్డే ప్రపంచ కప్ జరగనుంది. అయితే, దీనిని నిర్వహించడం ఐసీసీకి కఠిన సవాళ్లతో కూడుకున్నదే. వన్డే ఫార్మాట్‌కు ఇప్పుడు అసలు చోటు ఉందా? అనిపిస్తోంది. కానీ, అఫ్గానిస్థాన్ - ఇంగ్లండ్ మ్యాచ్ ముందు వరకు ఛాంపియన్స్ ట్రోఫీ పైన పెద్దగా ఆసక్తి లేకుండా పోయింది. కానీ, ఆ మ్యాచ్‌లో అఫ్గాన్ అద్భుతంగా పోరాడి విజయం సాధించి పోరును రసవత్తరంగా మార్చింది. ముమ్మందు ఈ ఫార్మాట్‌కు భవిష్యత్తు ఉండాలంటే కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది” అని అశ్విన్ తెలిపాడు.

# వర్షంతో కీలక మ్యాచ్‌ల రద్దు..

## పాక్ క్రికెట్ బోర్డును దుయ్యబడుతూ పోస్టులు



**ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా గ్రూప్ బీలో లాహోర్ వేదికగా నిర్వహించిన ఆస్ట్రేలియా, అఫ్గాన్ మధ్య మ్యాచ్ వర్షంతో రద్దయింది. దీంతో ఆసీస్ సెమీస్ చేరింది. తొలుత అఫ్గాన్ 50 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌట్ కాగా, ఆసీస్ 12.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 109 పరుగులు చేసింది. ఈ దశలో వర్షం కురవడంతో మ్యాచ్ కొనసాగలేదు. సెమీస్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న అఫ్గాన్ దాదాపు టోర్నీ నుంచి నిష్క్రమించినట్లే. ఛాంపియన్స్ ట్రోఫీలో ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌ల్లో మూడు వర్షం కారణంగా రద్దయ్యాయి. దీంతో అభిమానులతో పాటు నిపుణులు పాక్ క్రికెట్ బోర్డుపై విమర్శలు గుప్పిస్తున్నారు. చాన్నాళ్ల తర్వాత పాక్‌కు ఐసీసీ టోర్నీ నిర్వహించే అవకాశం లభించింది. దీంతో ఆ దేశం రూ. కోట్లు ఖర్చు పెట్టి కరాచీ, లాహోర్, రావల్పిండిలో స్టేడియాలను పునరుద్ధరించారు.**

అయితే కొద్ది వర్షానికే నీరు ఔట్‌ఫీల్డ్‌లో చేరడం, వెంటనే గ్రౌండ్‌ను ఆటకు అనువుగా మార్చే స్థితి లేకపోవడంతో మ్యాచ్‌లు రద్దవుతున్నాయి. తాజాగా ఆసీస్, అఫ్గాన్ మ్యాచే అందుకు ఉదాహరణ. కేవలం 30 నిమిషాలు వర్షం పడడంతో ఔట్ ఫీల్డ్ అంతా చిత్తడిగా మారింది. దీంతో మ్యాచ్ కొనసాగించే పరిస్థితి లేక అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. దీనిపై అభిమానులు పలువురు సోషల్ మీడియా పోస్టులు చేస్తున్నారు. పాక్ క్రికెట్ బోర్డును దుయ్యబడుతున్నారు. సమీప భవిష్యత్తులో పాక్‌కు ఎలాంటి ఐసీసీ ఆతిథ్య హక్కులు ఇవ్వద్దని డిమాండ్ చేస్తున్నారు.

ఫిబ్రవరి 25న రావల్పిండిలో ఆసీస్, సౌత్ ఆఫ్రికా మధ్య టాస్ పడకుండానే మ్యాచ్ రద్దు అయింది. ఇక ఫిబ్రవరి 27 సైతం రావల్పిండిలోనే పాక్, బంగ్లా మధ్య సైతం టాస్ పడకుండా మ్యాచ్ రద్దైంది. దీంతో ఈ టోర్నీలో ఆతిథ్య పాక్ ఒక్క మ్యాచ్ సైతం గెలవకుండా టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక ఇంగ్లాండ్‌పై సూపర్ విక్టరీ సాధించిన అఫ్గాన్.. వర్షం పడి మ్యాచ్ రద్దు కావడంతో సెమీస్ ఆశలు వదిలేసుకుంది.

ప్రస్తుతం పాయింట్ల పట్టికలో దక్షిణాఫ్రికా, అఫ్గాన్ చెరో మూడు పాయింట్లతో సమంగా ఉన్నప్పటికీ, నెట్ రన్‌రేట్‌లో సౌతాఫ్రికా మెరుగ్గా ఉంది. అంతేకాకుండా ఆ జట్టు ఇంకో మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఆ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ చేతిలో దక్షిణాఫ్రికా భారీ తేడాతో ఓటమి పాలైతే తప్ప.. అఫ్గాన్‌కు సెమీస్ అవకాశాలు ఉండవు. దక్షిణాఫ్రికా ఛేజింగ్‌లో 207 పరుగుల తేడాతో ఓటమి పాలైతేనే అఫ్గాన్ సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. ఇది దాదాపు అసాధ్యం అనే చెప్పవచ్చు. మరోవైపు గ్రూప్ ఏ నుంచి భారత్, కివీస్ సెమీస్‌కు దూసుకెళ్లిన విషయం తెలిసిందే.

# సెమీస్‌లో భారత్ ప్రత్యర్థి ఎవరు?

## అఫ్గాన్‌కూ ఓ ఛాన్స్.. సమీకరణాలు ఇలా!

**ఛాంపియన్స్ ట్రోఫీలో సెమీస్ బెర్తుల్లో మూడు ఖరారు అయిపోయాయి. గ్రూప్ %ూ% నుంచి భారత్, న్యూజిలాండ్ జట్లు సెమీస్‌కు అర్హత సాధించాయి. గ్రూప్ స్టేజ్‌లో వీరి మధ్య ఆదివారం చివరి మ్యాచ్ జరగనుంది. ఇందులో గెలిచిన జట్టు అగ్రస్థానానికి చేరుకుంటుంది. మరోవైపు గ్రూప్ Bలో ఆస్ట్రేలియా ఇప్పటికే సెమీఫైనల్‌కు చేరుకుంది. నెట్ రన్‌రేట్ ప్రకారం దక్షిణాఫ్రికా సెమీస్ బెర్తుకు చేరువగా ఉండగా.. అఫ్గానిస్థాన్ ఆ తర్వాత కాచుకుని ఉంది. ఇవాళ తన చివరి లీగ్ మ్యాచ్‌లో సఫారీ జట్టు ఇంగ్లండ్‌తో తలపడనుంది. భారత్‌ను సెమీస్‌లో ఢీకొట్టేదెవరనేది ఆదివారం తేలనుంది. ఆ ప్రత్యర్థి ఎవరో తెలుసుకోవాలంటే ఈ సమీకరణాలు అత్యంత కీలకం.**



ప్రస్తుతం గ్రూప్ %దీ%లో ఆస్ట్రేలియా మూడు మ్యాచుల్లో ఒకటి గెలిచింది. మరో రెండు వర్షం కారణంగా రద్దయ్యాయి. దీంతో ఆసీస్ ఖాతాలో 4 పాయింట్లు ఉన్నాయి. సెమీస్‌కు చేరుకుంది.

దక్షిణాఫ్రికా (3 పాయింట్లు, ం2.140) రెండు మ్యాచుల్లో ఒకటి గెలిచింది. మరొకటి రద్దైంది. చివరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో తలపడనుంది. అఫ్గానిస్థాన్ (3 పాయింట్లు, - 0.990) ఒక మ్యాచ్‌లో గెలిచి, మరొక దాంట్లో ఓడింది. ఒక మ్యాచ్ రద్దైంది. నెట్‌రన్‌రేట్ పరంగా సఫారీ జట్టే ముందుంది. ఒకవేళ చివరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై ఇంగ్లండ్ విజయం సాధించిందనుకుందాం. అప్పుడు నెట్ రన్‌రేట్ కీలకం కానుంది. ఈ విషయంలో అఫ్గాన్ కంటే దక్షిణాఫ్రికా కిందికి వెళ్లాలంటే పెను సంచలనమే జరగాలి. తొలుత ఇంగ్లండ్ బ్యాటింగ్ చేసి 300ం స్కోరు రాబడితే.. దక్షిణాఫ్రికాను 207 పరుగుల తేడాతో ఓడించాలి. ఒకవేళ ఇంగ్లండ్ రెండోసారి బ్యాటింగ్ చేసినప్పుడు 300ం టార్గెట్‌ను 11.1 ఓవర్లలోనే ఛేదించాలి. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా గెలిస్తే మాత్రం ఈ సమీకరణాలతో పనే లేదు. నేరుగా అగ్రస్థానంతో సెమీస్‌కు చేరుతుంది. ఇప్పుడు గ్రూప్ Aలో న్యూజిలాండ్, భారత్ చెరో నాలుగేసి పాయింట్లతో ఉన్నాయి. తమ ఆఖరి మ్యాచ్‌లో ఎవరు గెలిస్తే వారిదే తొలి స్థానం. ఆదివారం పోరులో కివీస్‌పై గెలిస్తే భారత్ టాప్‌లోకి దూసుకెళ్తుంది.


పైన పేర్కొన్న సఫారీ జట్టు అగ్రస్థానం, ఆసీస్ రెండో స్థానంతో సెమీస్‌లో అడుగుపెట్టాయనుకుందాం. అప్పుడు భారత్ Vs ఆసీస్, న్యూజిలాండ్ vs దక్షిణాఫ్రికా తలపడే అవకాశాలు ఉంటాయి. భారత్, దక్షిణాఫ్రికా తమ చివరి లీగ్ మ్యాచుల్లో ఓడినా సెమీస్ ప్రత్యర్థుల్లో మార్పు ఉండదు.

ఒకవేళ కివీస్‌పై భారత్ గెలిచి.. ఇంగ్లండ్ చేతిలో దక్షిణాఫ్రికా ఓడిపోయిందనుకుందాం.. అప్పుడు సెమీస్‌లో సఫారీ జట్టుతో టీమ్ఇండియా తలపడుతుంది. న్యూజిలాండ్ - ఆస్ట్రేలియా రెండో సెమీఫైనల్‌లో ఆడతాయి. కివీస్ చేతిలో భారత్ ఓడి.. ఇంగ్లండ్‌పై దక్షిణాఫ్రికా గెలిచినా సెమీస్‌లోనూ ఇదే పోరు కొనసాగుతుంది. దక్షిణాఫ్రికా సెమీస్‌కు చేరుకోకపోతే మాత్రం ఆ స్థానంలో అఫ్గానిస్థాన్ వచ్చేస్తుంది. అప్పుడు టీమ్ఇండియా అగ్రస్థానంలో ఉంటే అఫ్గాన్‌తోనే సెమీఫైనల్‌లో ఆడాల్సి ఉంటుంది. భారత్ రెండో స్థానానికి పరిమితమైతే మాత్రం ఆసీస్‌తో బరిలోకి దిగాల్సిన పరిస్థితి ఎదురైనా ఆశ్చర్యపోనక్కరలేదు.

# పాక్ కెప్టెన్ రిజ్వాన్ ఇంగ్లిష్‌పై

# యాంకర్ ఎగతాళి..

## స్పందించిన నెటిజన్లు



పాకిస్థాన్ జట్టు సారథి మహ్మద్ రిజ్వాన్ ఇటీవల ఓ మీడియా సమావేశంలో మాట్లాడాడు. అందులో అతడు ఇంగ్లిష్ మాట్లాడిన విధానాన్ని ఉద్దేశిస్తూ ఆ దేశ టీవీ యాంకర్ తబీష్ హష్మీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారి తీశాయి. రిజ్వాన్ నైపుణ్యాలను ఎగతాళి చేసినట్లుగా వ్యాఖ్యానించారంటూ కొందరు అభిమానులు మండిపడ్డారు. “రిజ్వాన్ 25 కోట్ల మంది ప్రజల తరపున ప్రాతినిధ్యం వహించారు. అతడు చూడడానికి మంచిగా, అనర్గళంగా మాట్లాడాలని, క్రికెట్‌లో ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని కోరుకుంటాం. ఇటీవల రిజ్వాన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడడం చూశాను. అయితే.. అతడు ఇంగ్లిష్‌లోనే మాట్లాడాలని నేను అనడం లేదు. కానీ, రిజ్వాన్ ఉర్దూలో చక్కగా మాట్లాడగలడు” అని యాంకర్ వ్యాఖ్యానించాడు. ఆయన వ్యాఖ్యలకు క్రికెటర్ అహ్మద్ షెజాద్ నవ్వారు. అందుకు సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరలయ్యాయి.

దీనిపై స్పందించిన నెటిజన్లు.. ‘మన దేశ జట్టు కెప్టెన్‌ను ఎగతాళి చేస్తారా..?’.. ‘ఇలా కామెంట్ చేయడం సరైంది కాదు’ అంటూ కొందరు పోస్టులు పెట్టారు. మరికొందరు యాంకర్ వ్యాఖ్యలకు మద్దతు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు పేలవ ప్రదర్శన ఇచ్చింది. న్యూజిలాండ్, భారత్‌తో జరిగిన మ్యాచుల్లో పరాజయం పాలైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత తదుపరి మ్యాచుల నుంచి ఆ జట్టు నిష్క్రమించింది. దీంతో పాక్ జట్టుపై సొంత దేశం నుంచే విమర్శలు వస్తున్నాయి.

# ధనశ్రీతో విడాకుల వార్తల వేళ చాహల్ సోషల్ మీడియాలో పోస్టు

**భారత స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మకి సంబంధించి కొన్ని రోజులుగా విడాకుల వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో చాహల్ ఇన్‌స్టా వేదికగా పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. “నియంత్రించలేనంత గందరగోళ పరిస్థితుల్లో ఉన్నప్పుడు దయతో ఉండటమే అన్నింటికంటే మంచి పని” అని రాసుకొచ్చారు.**



చాహల్ - ధనశ్రీవర్మ 2020లో వివాహబంధంలోకి అడుగుపెట్టారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ జంట.. గతంలో పెట్టిన పోస్టులు అభిమానులను గందరగోళానికి గురిచేశాయి. సామాజిక మాధ్యమాల్లో వీరిద్దరూ ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడం, ధనశ్రీ తన పేరు నుంచి ‘చాహల్’ పదాన్ని తొలగించడంతో విడాకులపై ఊహాగానాలు మొదలయ్యాయి. వీరి విడాకుల కేసుపై ముంబయిలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టులో ఇటీవల తుది విచారణ జరిగినట్లు తెలుస్తోంది.

దీనికి చాహల్, ధనశ్రీ వ్యక్తిగతంగా హాజరయ్యారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు వీరికి 45 నిమిషాల పాటు కౌన్సెలింగ్ సెషన్ ఇచ్చినట్లు ఆ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయినా విడిపోవడానికే నిర్ణయించుకోవడంతో వీరికి విడాకులు మంజూరుచేస్తూ కోర్టు తీర్పు వెలువరించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. అప్పుడు.. ఒత్తిడి నుంచి విముక్తి లభించిందంటూ ధనశ్రీ స్పందించగా, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నానని నేను గుర్తించేలోపే భగవంతుడు బయటపడేశాడని చాహల్ స్పందించారు. తీర్పు వచ్చిందంటూ వెలువడిన కథనాలపై ధనశ్రీ తరఫు న్యాయవాది మాట్లాడుతూ.. విడాకుల కేసు కోర్టు పరిధిలో ఉందని చెప్పిన సంగతి తెలిసిందే. మరోవైపు రూ.60 కోట్ల భరణం గురించి అనేక ఊహాగానాలు వినిపించాయి. వీటిని ధనశ్రీ కుటుంబం తోసిపుచ్చిన సంగతి తెలిసిందే. “భరణం గురించి వస్తోన్న నిరాధారమైన కథనాలు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి.

తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
CINIMA NEWS
ఆదివారం
02 మార్చి 2025
సినిమా వార్తలు

# వైష్ణవి చైతన్య.. క్యూట్‌నెస్‌కు కేరాఫ్ అడ్రస్!!



టాలీవుడ్ హీరోయిన్ వైష్ణవి చైతన్య గురించి అందరికీ తెలిసిందే. టాలెంట్ ఉన్న తెలుగు అమ్మాయిలకు సినీ ఇండస్ట్రీలో కచ్చితంగా అవకాశాలు వస్తాయని చెప్పడంలో బెస్ట్ ఎగ్జాంపుల్ గా నిలిచింది. షార్ట్ ఫిల్మ్స్ ద్వారా కెరీర్ స్టార్ట్ చేసిన అమ్మడు.. లవ్ ఇన్ 143 అవర్స్, సాఫ్ట్ వేర్ డెవలపర్, మిస్సమ్మ వంటి పలు సిరీసులతో అలరించింది. అలా వివిధ వెబ్ సిరీసులతో యూత్ లో మంచి పాపులారిటీ సంపాదించుకుంది. అదే సమయంలో సినిమాల్లో చిన్న క్యారెక్టర్స్ చేయడం స్టార్ట్ చేసిన అమ్మడు.. టచ్ చేసి చూడుతో ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత గీత గోవిందం, అల వైకుంఠపురంలో, టాక్ జగదీశ్, వరుడు కావలెను వంటి సినిమాల్లో యాక్ట్ చేసింది బ్యూటీ. ఆ తర్వాత ఒక్కసారిగా ఆమె సుడి తిరిగిందని చెప్పాలి. బేబీ మూవీ హీరోయిన్ గా ఛాన్స్ వైష్ణవి సొంతమైంది. ఆనంద్ దేవరకొండ హీరోగా సాయి రాజేష్ దర్శకత్వం వహించిన ఆ సినిమాకు హార్ట్ అండ్ సోల్ ఆమెనే చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. అంతలా తన యాక్టింగ్ తో అన్ని వర్గాల ప్రేక్షకులను ఓ రేంజ్ లో ఆకట్టుకుంది. రూ.100 కోట్లు సాధించిన ఆ సినిమాకు గాను ఫిల్మ్ ఫేర్ అవార్డు సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఆమెకు ఒక్కసారిగా క్రేజీ బ్యూటీ గా మారిపోయింది. పలు సినిమా అవకాశాలు దక్కించుకుని నటిస్తోంది. అదే సమయంలో వైష్ణవి చైతన్యకు సంబంధించిన కొన్ని బ్యూటిఫుల్ పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. నిజానికి.. వైష్ణవి బర్త్ డే రోజు పెట్టిన పోస్ట్ ఇప్పుడు మళ్లీ వైరల్ అవుతోంది. అందులో ఒక్కో పిక్ వేరే లెవెల్ లో ఉంది. ప్రతి ఫోటోలో ఆమె ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ వేరే లెవెల్ అని చెప్పాలి. క్యూట్ నెస్ కు కేరాఫ్ అడ్రస్ గా నిలిచింది. తన గ్లామరస్ స్కిన్ టోన్ తో ఫిదా చేస్తుంది. ట్రెడిషనల్ అండ్ మోడ్రన్ ఔట్ ఫిట్స్ లో క్లీన్ బౌల్డ్ చేస్తుందనే చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. ప్రస్తుతం వైష్ణవి పిక్స్ ఉన్న పోస్ట్ పై నెటిజన్లు తెగ రెస్పాండ్ అవుతున్నారు. బేబీ బ్యూటీ సో క్యూట్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. అందమే అసూయ పడుతుందేమోనని ఆకాశానికెత్తేస్తున్నారు. అమ్మడు పిక్స్ అదిరిపోయాయని అంటున్నారు. అట్రాక్ట్ అయిపోతున్నామని చెబుతున్నారు. సో నైస్ మేడమ్ అంటూ సందడి చేస్తున్నారు నెటిజన్లు.. వైష్ణవి అభిమానులు..

## తనకు 28 ఏళ్ల వయసులోనే
# పిల్లలు పుట్టారన్న జ్యోతిక

**ప్రపంచవ్యాప్తంగా సినీ పరిశ్రమలు ఎదుగుతూ కొత్త దిశలో అడుగులు వేస్తున్నా సౌత్ ఇండస్ట్రీలో కొన్ని వాస్తవాలు ఇంకా అదే స్థితిలో ఉన్నాయనడంలో ముమ్మడిగా అంగీకరించాలి. ఈ మధ్యనే ప్రముఖ నటి జ్యోతిక తన అనుభవాల గురించి పంచుకుంటూ సౌత్ సినీ పరిశ్రమలోని కొన్ని కీలక అంశాలపై సమాధానాలు ఇచ్చారు.జ్యోతిక తన తాజా వెబ్ సిరీస్ 'దబ్బా కార్టెల్' నెట్‌ఫ్లిక్స్ లో విడుదల కావడంతో పాటు ఈ సిరీస్ ప్రమోషన్లలో పాల్గొని కొన్ని ఆసక్తికరమైన విషయాలను బయటపెట్టారు. ఆమె మాటలతో సినీ పరిశ్రమలోని వయస్సు పరిమితులు హీరోయిన్లకు ఎదురయ్యే చిక్కులు మరియు కొత్త దర్శకులతో చేసే పని పై చాలా చర్చ జరుగుతుంది.జ్యోతిక ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒక ముఖ్యమైన వ్యాఖ్య చేసింది.**



**జ్యోతిక తన అనుభవాలను పంచుకుంటూ**


అయితే హీరోయిన్ల వయసు పెరిగితే మాత్రం వారి కెరీర్‌ను కొనసాగించడం చాలా కష్టమవుతుంది అని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు సౌత్ సినీ పరిశ్రమలోని వాస్తవాన్ని రుజువు చేస్తున్నాయి.అంతేకాక, జ్యోతిక, తమకు 28 ఏళ్ల వయస్సులో పిల్లలు పుట్టారని, అప్పటి నుండి ఆమెకు విభిన్న పాత్రలు చేయడానికి అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. అప్పుడు తను స్టార్ హీరోలతో పనిచేయలేదని చెప్పారు. ఈ వ్యాఖ్యలు సౌత్ సినిమాలలో హీరోయిన్లకు ఇవ్వబడే అవకాశాల పట్ల కొంత దుఃఖాన్ని వ్యక్తం చేస్తున్నాయి.జ్యోతిక తన అనుభవాలను పంచుకుంటూ, తమిళ సినీ పరిశ్రమలో హీరోయిన్ల వయస్సును అడ్డంకిగా చూస్తారని చెప్పారు. ఇందులో ఆమె అభిప్రాయం ప్రకారం హీరోయిన్‌లకు వయసు పెరిగిన తరువాత, వారిని నెక్స్ట్ జెనరేషన్ దర్శకులు లేదా కొత్త సినిమా దర్శకులు పరిగణనలోకి తీసుకోరు. ఈ పరిస్థితి హీరోయిన్లకు ఎప్పుడూ చాలా కష్టం కలిగిస్తుంది.

**మాకు కొన్ని సవాళ్లు ఎదురయ్యేను**

ఆమె మాట్లాడుతూ 'ఈ పరిస్థితిని ఎదుర్కొనడం చాలా కష్టమైనది. కానీ మేము కూడా మన అభ్యుదయాన్ని తీసుకుంటూ, కొత్త దర్శకులతో కలిసి పనిచేసి, మన కెరీర్‌ను నడిపించాలి' అన్నారు. ఇది ఆమె ఆలోచనల ప్రకారం, నిర్మాతలు, దర్శకులు, మరియు ఇతర పరిశ్రమలో ఉన్న నాయికలందరికీ ఒక ప్రేరణ.జ్యోతిక, తమిళ సినీ పరిశ్రమలో హీరోయిన్లకు వచ్చిన ఈ సవాళ్లను, కొత్త దర్శకులతో పని చేయడం ద్వారా జయించవచ్చని చెప్పారు. "మాకు కొన్ని సవాళ్లు ఎదురయ్యేను, కానీ మనం వాటిని అధిగమించాలి" అని ఆమె అన్నారు. ఆమె మాటల్లో, కొత్త, ఆధునిక దృష్టి కలిగిన దర్శకులు, మంచి కథలను తీసుకువచ్చే అవకాశం ఉంది.సినీ పరిశ్రమలో ఇలాంటి మార్పులు సుసాధ్యం కావడానికి, ప్రముఖ నటులు, నటీమణులు తమ పరిచయాలను, అనుభవాలను వినియోగించుకోవడం అత్యంత అవసరం. జ్యోతిక తన అనుభవాలను పంచుకుంటూ, ఈ విషయాలను మరింత స్పష్టంగా వివరించారు.

# నేషనల్ క్రష్.. ఏం చేసినా సెన్సేషనే..

**టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన కొన్ని సంవత్సరాల్లోనే అగ్రస్థాయికి చేరుకున్న హీరోయిన్ రష్మిక మందన్న.. ఇప్పుడు నేషనల్ క్రష్ గా గుర్తింపు తెచ్చుకుంది. 'గీత గోవిందం' తర్వాత 'పుష్ప'తో దేశవ్యాప్తంగా తన హవాను కొనసాగించింది. ఇక ఇటీవల 'పుష్ప 2' మాస్ మేనియాతో పాటు, బాలీవుడ్ లో విక్కీ కౌశల్ తో చేసిన 'ఛావా'తో మరోసారి టాప్ స్పాట్ అందుకుంది. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లు రాబట్టాయి.**




'పుష్ప 2' రూ.1800 కోట్లకు పైగా వసూలు చేయగా, 'ఛావా' రెండు వారాల్లో రూ.555.3 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడు రష్మిక తన లేటెస్ట్ ఫోటోషుట్ తో మరోసారి ట్రెండ్ లోకి వచ్చింది. ఈ మధ్య రష్మిక ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ చేసిన ఫోటోలు నెటిజన్లను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. పసుపు రంగు డ్రెస్సులో, సంప్రదాయమైన లుక్ లో బ్లాక్ వైట్ ఫోటోషుట్ తో అమ్మడు కొత్తగా మెరిసిపోతోంది.



హాయిగా నవ్వుతూ, పూలను ఉపయోగిస్తూ చేసిన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేశాయి. ఫోటోలలో కనిపిస్తున్న యెల్లో అవుట్‌ఫిట్ ఆమె గ్లామర్ ను మరింత మెరుగు పరచింది. ఆమె ముఖ కవళికలు, చూపులు నెటిజన్లను ఉర్రూతలూగిస్తున్నాయి. సోషల్ మీడియాలో రష్మిక చేసే ప్రతీ పోస్ట్ వైరల్ అవుతుందనడంలో సందేహం లేదు. ఇప్పుడు ఆమె పోస్ట్ చేసిన ఈ ఫోటోలు లక్షల కొద్దీ లైక్స్, వేల సంఖ్యలో కామెంట్లు సంపాదించుకుంటున్నాయి. పుష్పరాజ్ శ్రీవల్లి క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, ఆమె హావభావాలు నెటిజన్లను అలరిస్తున్నాయి. "ఎప్పుడూ లవ్లీ లుక్ తో ఆకట్టుకునే నేషనల్ క్రష్", "ఈ సింప్లిసిటీ నే అందరికీ నచ్చేలా చేస్తుంది" అంటూ కామెంట్స్ విపరీతంగా వస్తున్నాయి. ఇక కెరీర్ విషయానికి వస్తే, రష్మిక ప్రస్తుతం బిజీగా ఉంది. బాలీవుడ్ లో 'సికందర్' అనే సినిమా చేస్తోంది. అలాగే మరికొన్ని లేడీ ఓరియంటెడ్ సినిమాలు లైన్ లో ఉన్నాయి. కెరీర్ పరంగా రష్మిక ఊహించని స్థాయిలో ఎదుగుతూ, వరుసగా బ్లాక్ బస్టర్ సినిమాలు అందుకుంటూ వెండితెరను దుమ్ములేపుతోంది.

# మళ్లీ నటిస్తా..

%1990ల నటి రంభ మళ్లీ ఇండిస్టీలో అడుగుపెడతానని అంటున్నారు. తెలుగు, తమిళం, మలయాళ, హిందీ, కన్నడ ఇలా అన్ని భాషల్లో నటించిన ఆమె పెళ్లి తరువాత ఇండిస్టీకి దూరంగా ఉన్నారు. తాజాగా తన రీ ఎంట్రీ గురించి ఆమె మాట్లాడారు. 'నా ఫస్ట్ ఛాయిస్ ఎప్పుడూ సినిమానే. ఎలాంటి ఛాలెంజింగ్ రోల్స్ చేసేందుకు అయినా నేను సిద్ధంగా ఉన్నాను. ఇదే సరైన సమయం అని నేను భావిస్తున్నాను. కొత్త పాత్రలను ఎంచుకుని, మళ్లీ ఆడియెన్స్‌ను ఆకట్టుకునే సినిమాలతో రీ ఎంట్రీ ఇవ్వాలని ఎదురు చూస్తున్నాను' అని అన్నారు.



# కన్నప్ప టీజర్ విడుదల

**తెలుగు సినీ పరిశ్రమలో ఎప్పటికీ గుర్తుండిపోయే భక్తి చలనచిత్రాలలో 'భక్త కన్నప్ప' ఒకటి. అలాంటి మహద్భావాన్ని కొత్త తరానికి పరిచయం చేయాలని మంచు విష్ణు నిశ్చయించుకున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన కన్నప్ప సినిమా ఈ ఏడాది ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. స్వయంగా తన 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించడమే కాకుండా, కథానాయకుడిగా కూడా పోషించారు. ఈ సినిమా కథ మహాభక్తుడైన తిన్నడు అనే గిరిజన యోధుడి జీవితం ఆధారంగా రూపొందింది. పరమశివుడికి తన కళ్లను సమర్పించేంతటి భక్తి భావంతో ఓ సాధారణ గిరిజనుడు 'కన్నప్ప' గా ఎలా మారాడు? అన్నదే చిత్ర ఇతివృత్తం. ఇటీవలే విడుదలైన టీజర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది.**

**టీజర్ విశేషాలు**

కన్నప్ప టీజర్ ప్రారంభం నుంచే హై ఇంటెన్సిటీతో సాగుతుంది. గిరిజన తెగలు, వాళ్లలోని పోరాటస్ఫూర్తి, వారిలో నాయకత్వం, తిన్నడి ధైర్యసాహసాలు ఇవన్నీ కళ్లకు కట్టినట్టుగా చూపించారు. పరమశివుడిపై నాస్తిక దృక్పథంతో ఉన్న తిన్నడు ఎలా మారాడు? అతను ఎలా అద్భుతమైన భక్తునిగా పరిణమించాడు? అన్నదే టీజర్ మూలసారాంశం. సినిమాలో ప్రధానమైన పాత్రధారులందరినీ టీజర్‌లో చూపించారు. అక్షయ్ కుమార్, మోహన్ బాబు, ప్రభాస్, శరత్‌కుమార్, దేవరాజ్, ముఖేశ్ ఋషి, మోహన్ లాల్, కాజల్ అగర్వాల్, మధుబాల వంటి తారాగణం ఇందులో భాగమయ్యారు. ఈ భారీ తారాగణం సినిమాపై అంచనాలను మరింత పెంచింది.

**కన్నప్ప పాత్రలో మంచు విష్ణు**

మంచు విష్ణు తన కెరీర్‌లో ఇప్పటి వరకు ఎప్పుడూ లేనంతగా విభిన్నమైన పాత్రను పోషించారు. ఇప్పటి వరకు ఆయన ఎక్కువగా కమర్షియల్ సినిమాలకే పరిమితమయ్యారు. కానీ కన్నప్ప లో శారీరకంగా, భావోద్వేగపరంగా కూడా చాలా కష్టపడి నటించారని టీజర్ చూస్తేనే అర్థమవుతోంది. అయితే, ఈ సినిమాలో తిన్నడి పాత్రను ఒక యోధుడిగా చూపించడంపై సినీ ప్రేమికులు ఆసక్తిగా ఉన్నారు. సీనియర్ కృష్ణంరాజు నటించిన 1976 నాటి భక్త కన్నప్పలో తిన్నడు చాలా సాధారణంగా, ఒక నిర్లక్ష్యభావం ఉన్న వ్యక్తిగా చూపిస్తారు. కానీ కన్నప్ప సినిమాలో తిన్నడిని మహా వీరుడిగా ప్రెజెంట్ చేయడం విశేషం.

**విజువల్స్ మరియు సాంకేతికత**

ఈ చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్ చాలా పెద్ద హైలైట్ కానున్నాయి. నేటి కాలానికి తగిన విధంగా హాలీవుడ్ స్థాయిలో గ్రాఫిక్స్ వాడారు. సినిమాటోగ్రఫీ, ఆర్ట్ డైరెక్షన్, యాక్షన్ సీక్వెన్స్‌లు అన్నీ గొప్ప స్థాయిలో




ఉన్నట్లు టీజర్ లో కనిపిస్తోంది. ఒక అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాకు చాలా ప్లస్ అవుతుందని అనిపిస్తోంది. శివ భక్తి, యుద్ధాలు, పోరాటాలు, భావోద్వేగాలు అన్నీ ఒకే చోట చక్కగా మిళితమయ్యాయి. ఈ సినిమా సాధారణ భక్తి సినిమాగా కాకుండా మాస్, యాక్షన్, సెంటిమెంట్ కలిపిన విధంగా తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. బహుశా ఇది పాన్ ఇండియా లెవల్లో కూడా విడుదల కావచ్చు. కర్నాటక, తమిళనాడు, కేరళ, హిందీ బాషల్లో కూడా కన్నప్ప కథ చాలా ప్రాచుర్యం పొందిన కథ కావడం విశేషం

**ఒరిజినల్ 'భక్త కన్నప్ప'తో పోలికలు తప్పవు**

నందమూరి బాలకృష్ణ కూడా ఒకప్పుడు భక్త కన్నప్ప సినిమాను రీమేక్ చేయాలని అనుకున్నారు. కానీ అది పూర్తికాలేదు. అయితే, సీనియర్ కృష్ణంరాజు నటించిన 1976 నాటి సినిమా ఇప్పటికీ ప్రజల హృదయాల్లో ఉంది. అందుకే నూతన కన్నప్ప సినిమాతో ఆ సినిమాను ఏమేరకు బీట్ చేయగలరు? అన్నదే ఆసక్తికరమైన ప్రశ్న. కానీ టీజర్‌ను బట్టి చూస్తే, భారీ యాక్షన్ సన్నివేశాలు, నూతన ప్రెజెంటేషన్, హై-ఎండ్ గ్రాఫిక్స్ ఈ సినిమాకు పెద్ద ప్లస్ అవుతాయని చెప్పొచ్చు. ఈ సినిమా సాధారణ భక్తి సినిమాల కంటే యాక్షన్, గ్రాఫిక్స్, గ్రాండ్ విజువల్స్ తో కూడిన మైథలాజికల్ మూవీగా రూపొందింది. అంటే, భక్తులకు, యాక్షన్ లవర్స్‌కు, విజువల్ వండర్స్‌ని ఇష్టపడేవారికి ఇదొక వినోదభరితమైన అనుభూతిగా నిలుస్తుందని చెప్పొచ్చు. ఏప్రిల్ 25, 2024 న సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమాపై తెలుగు ప్రేక్షకులు మాత్రమే కాకుండా హిందీ, తమిళ, కన్నడ, మలయాళ ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కన్నప్ప' సినిమా టీజర్ నమ్మకాన్ని పెంచింది. మంచి విజువల్స్, మాస్ అప్పీల్, గ్రాండ్ ప్రొడక్షన్ వాల్యూస్ సినిమాను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. ఇప్పుడు రాబోయే ట్రైలర్, పాటలు, మరిన్ని అప్డేట్స్ చూసి ఈ సినిమా ఏ స్థాయిలో ఉందో మరింత అంచనా వేయవచ్చు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by AITHABATHULA RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: AITHABATHULA RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339